తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం

31 ఆగస్టు, 2025






## కాంతి దాతలు.. శాంతి దూతలు

# గురువులే



# 'కాంత' సెప్టెంబరులో విడుదల



**తెలుగు** తెరకు ఈ మధ్య కాలంలో పరిచయమైన అందాల నాయిక భాగ్యశ్రీ బోర్సే. బాలీవుడ్ వైపు నుంచి ఎంట్రీ ఇచ్చినప్పటికీ, తెలుగు ఇండస్ట్రీకి రావడానికి పెద్దగా సమయం తీసుకోలేదు.

తెలుగులో ఆమె చేసిన 'మిస్టర్ బచ్చన్' అంతగా ఆడలేదు. ఆ సినిమా కథను మరిచిపోయినంత తేలికగా ప్రేక్షకులు ఆమె గ్లామర్‌ను మరచిపోలేకపోయారు. ఆమెకు ఉన్న క్రేజ్ కారణంగానే 'కింగ్ డమ్'లో ఛాన్స్ వచ్చింది. తెలుగు ఇండస్ట్రీలోకి సరైన సమయంలో భాగ్యశ్రీ ఎంట్రీ ఇచ్చింది. ఎందుకంటే ఇప్పుడు ఇక్కడ హీరోయిన్స్ వైపు నుంచి పెద్దగా పోటీ లేదు. ఈ సమయంలో భాగ్యశ్రీ గ్లామర్‌కి హిట్ తోడైతే బాగానే ఉండేది కానీ, అందుకు ఆమె చాలా దూరంలోనే ఉంది.

అయితే 'కాంత' సినిమాతో ఆమె దశ తిరిగిపోవడం ఖాయమనే టాక్ బలంగా వినిపిస్తోంది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆమె దుల్కర్ సల్మాన్ జోడీగా కనిపించనుంది. తమిళంతో పాటు ఈ సినిమా తెలుగు, కన్నడ భాషల్లోను విడుదల కానుంది. తమిళ, కన్నడ భాషా ప్రేక్షకులకు ఆమె పరిచయమవుతున్న సినిమా ఇదే. 1950 కాలం నాటి కథా నేపథ్యంలో మద్రాస్ వేదికగా ఈ సినిమా నడుస్తుంది. 'కాంత'లో భాగ్యశ్రీకి గ్లామర్‌తో పాటు నటనకి స్కోప్ ఉన్న పాత్ర దక్కింది. అందువలన ఈ సినిమాతో ఆమె కెరియర్ పుంజుకోవడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సెప్టెంబర్ 12వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది.

తారాతీరం

# షూటింగు దశలో 'పెద్ది'

**బాలీవుడ్‌లో** అడుగుపెట్టి దాదాపు ఎనిమిదేళ్లు అవుతోంది. అక్కడ చెప్పుకోదగిన భారీ విజయాలు ఆమె ఖాతాలో పడలేదుగానీ, ఓ మాదిరి సక్సెస్‌లతోనే సరిపెట్టుకుంటోంది. అయితే టాలీవుడ్‌కి మాత్రం ఒక భారీ హిట్‌తోనే పరిచయం కావాలని ఆమె భావించింది. శ్రీదేవి కోరుకున్నది కూడా అదే. తల్లి ముచ్చట తీర్చడం కోసం జాన్వీ తీసుకున్న సమయం కూడా ఎక్కువే.

జాన్వీ తెలుగుకి సంబంధించి చాలా కథలు విన్న తరువాత, అన్నీ శుభ శకునాలు కనిపిస్తున్నాయని చెప్పి "దేవర'కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొరటాల దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. దాంతో ఆమె చాలా డీలాపడిపోయేదే. అయితే లక్కీగా ఆ వెంటనే ఆమెకి 'పెద్ది' ఛాన్స్ వచ్చింది. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా, ప్రస్తుతం షూటింగు దశలో ఉంది.

ఎన్టీఆర్, చరణ్ .. 'ఆర్ఆర్ఆర్' చేస్తున్నప్పుడు, ఆ సినిమాతోనే జాన్వీ పరిచయమవుతుందనే వార్తలు వచ్చాయి. దాంతో ఎన్టీఆర్ జోడీ అయితే బాగుంటుందని ఆయన అభిమానులు, చరణ్ సరసన అయితే కరెక్టుగా ఉంటుందని ఆయన ఫ్యాన్స్ ఆశపడ్డారు. అయితే ఆ తరువాత ఆమె ఈ ఇద్దరి హీరోలతోనే మొదటి రెండు సినిమాలు ప్లాన్ చేయడం విశేషం. వచ్చే మార్చిలో విడుదల కానున్న 'పెద్ది' సినిమాతో హిట్టు పట్టుకెళ్లాలనే పట్టుదలతో జాన్వీ ఉన్నట్టుగా సమాచారం.



ఆదివారం వార్త

31 ఆగస్టు, 2025

## మంచి ముత్యాలు

– చీకట్లో కూర్చుని తన ఏకాంతాన్ని మనోహర శబ్దాలతో ఉల్లాసపరచడానికి పాడుకునే కోయిల వంటివాడు కవి. – షెల్లి

– విదూషకుడు క్రియాశీల కవి వంటివాడు. – హెన్రీ మిల్లర్

## కదంబం

'సంఘీ'భావం....5

ఆన్‌లైన్ గేమింగ్ పై కేంద్రం కన్నెర్ర

కవర్ స్టోరీ..6

కాంతి దాతలు..శాంతి దూతలు గురువులే

ఈ వారం కవిత్వం...12

అక్షరాన్ని..

కథ..20

తడిసిన జ్ఞాపకాలు

తేనెలొలుకు తెలుగు.. 23

అరుదైన బ్లడ్ గ్రూప్.. 26

కళాత్మకత ఉట్టిపడే.. 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వంటలు

వగైరా.. వగైరా..

# సమాచారం

## చిన్న ప్రయత్నం.. ఫలితం అనూహ్యం

సాధారణ వ్యక్తులు చేసే పనులు కూడా ఒకోసారి అనూహ్యమైన మార్పులు తీసుకొస్తాయి. అరుదుగా ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయి. అలాంటి సంఘటనే ఇది.

బీహార్‌కు చెందిన ఓ యువకుడు చేసిన కొన్ని రీల్స్ మారుమూల కుగ్రామంలోని చిన్నారులకు భవిష్యత్తునిచ్చాయి.



బీహారుకు చెందిన అశ్వనీ థాప అనే వ్యక్తి ఇన్‌స్టాలో రీల్స్ స్క్రోలింగ్ చేస్తున్న సమయంలో ఓ పాఠశాల కనిపించింది. అది సిక్కింలోని సార్డాంగ్ అనే మారుమూల పల్లెలో ఉంది. ఆ పాఠశాల గురించి విచారించగా దానిని లక్పా దావ షెర్పా అనే మౌంటెన్ గైడ్ తన ట్రెక్కింగ్ కెరీర్‌ను వదిలేసి ఆ గ్రామంలోని రైతులు, కూలీల పిల్లలకు చదువు చెప్పడం కోసం తన ఇంటినే గురుకుల పాఠశాలగా మార్చినట్లు తెలిసింది. అతనిని చూసి స్ఫూర్తి పొందిన అశ్వనీ వాలంటీర్‌గా అక్కడి విద్యార్థులకు పాఠాలు చెప్పడం కోసం ఆ ఊరికి వెళ్లాడు. వెళ్లిన తరువాత అక్కడి పరిస్థితులు చూసి ఎంతగానో చలించిపోయాడు. సరైన సౌకర్యాలు కల్పించడం కోసం తన కెమెరాతో ఆ పాఠశాలలోని దినచర్యను రీల్‌నసగా చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసాడు. విద్యార్థులకు పాఠాలు చెప్తూ, వాళ్ల జీవన విధానాన్ని రీల్స్ చేసాడు. అతడి రీల్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అంతేకాదు, అతడి ప్రయత్నాన్ని మెచ్చుకున్న నెటిజన్లు పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందించారు. లక్షలకొద్దీ విరాళాలు రావడంతో పాఠశాలకు కొత్త భవనం, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా మైదానం ఏర్పాటు చేసారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## మల్టీ బ్యాగర్

సుబ్బారావుకు పట్టరాని కోపం వచ్చింది.

కారణం.. ఒక స్టాక్ బ్రోకర్ సలహా మేరకు లక్షలు పెట్టి కొన్ని స్టాక్స్ కొన్నాడు, అవి మల్టీ బ్యాగర్ అవుతుందని ఆ బ్రోకర్ పదే ప దే చెప్పాడు. కానీ ఇప్పుడు ఆ స్టాక్ విలువ సగానికి పడిపోవడంతో ఆ బ్రోకర్‌ను ప్రశ్నించాడు.

అందుకు ఆ బ్రోకర్, మల్టీ బ్యాగర్ అంటే రెండింతలు మూడింతలు లాగా పెరగడం కాదు. అది సగం అవడం కూడా. మల్టీ బ్యాగర్ కిందే లెక్క. ఎందుకంటే ఇక్కడ 0.5తో స్టాక్ విలువను గుణిస్తున్నాం.

అవాక్కయిపోవడం సుబ్బారావు వంతయింది.

## మల్టీ బ్యాగర్

తన పార్టీ సభకు, కాంట్రాక్టర్‌కు లక్షలకొద్దీ డబ్బులిచ్చినప్పటకీ ఎక్కువ మంది రాకపోవడంతో, ఆ పార్టీ నేత సదరు ఆ కాంట్రాక్టర్‌పై అరిచాడు,



కానీ అతను చాలా ప్రశాంతంగా, "సార్! మీ ప్రత్యర్థి పార్టీవారు వేరే కాంట్రాక్టర్‌కు జనాలను రాకుండా చేయదానికి అంతకు రెట్టింపు డబ్బులు ఇచ్చాడు. అది అసలు సంగతి" అన్నాడు.

– కె.లహరి, కరీంనగర్

## ఆఖరి కోరిక

జైలు అధికారి: రేపు నీకు ఉరి శిక్ష విధిస్తారు.. నీకు ఆఖరి కోరిక ఏమైనా ఉందా?

ఖైదీ: బిర్యానీతో పాటు ఇంకొకటి కూడా ఉంది.

జైలు అధికారి: ఏంటది?

ఖైదీ: ఎక్కడ పడితే అక్కడ సీసీ కెమెరాలు పెట్టి మా లాంటి నేరస్తులను పట్టుకుంటున్నారు. సీసీ కెమెరాలు వాడడం తగ్గించండి!

## నేను చేసింది.. కరెక్టే!

పోలీస్: నువ్వు ఆ హోటల్లో బియ్యం బస్తాలు ఎందుకు దొంగతనం చేసావు?

దొంగ: నేను కరక్టే చేసాను.

పోలీస్: దొంగతనం చేయడం కరెక్టా?

దొంగ: అన్నంలో రాళ్ళు వస్తున్నాయి అని ప్రతి రోజూ కస్టమర్స్ గగ్గోలు పెడుతున్నారు.. ఇప్పుడు ఆ బాధ ఉండదు కదా!

## తక్కువ శిక్ష

మొదటి ఖైదీ: నేను హత్య చేయకపోయినా అరెస్ట్ చేసి ఇలా జైల్లో పెట్టారు.

రెండో ఖైదీ: నేను హత్య చేసాను. కానీ వేరేవాడు ఆ హత్య చేశాడని వాడికి ఉరి శిక్ష వేసారు. నేను వాడికి సహాయం చేశానని నాకు తక్కువ కాలం శిక్ష వేసారు.

## మీటింగ్

ఓనర్: ప్రతి శుక్రవారం పనికి లేట్‌గా వస్తున్నావు.. గుడికి వెళ్తున్నావు కదా! నీకు భక్తి ఎక్కువే!

పని మనిషి: గుడికి కాదు. పనిమనుషుల లీడర్ మీటింగ్‌కి వెళ్లి వస్తున్నాను.

## బంగారు బొచ్చెతో..



కోటీశ్వరుడు: నీ బాధ చూసి జాలిగా ఉంది. నీకు లైఫ్ ఇస్తాను.. బోలెడంత డబ్బు ఇస్తాను, ఆ డబ్బుతో ఏం చేస్తావు?

బిచ్చగాడు: బంగారం, వజ్రాలతో పొదిగిన బొచ్చె తయారు చేయించి అందులో అడుక్కుంటాను.

## రిపోర్ట్స్ మారాయి..

పేషంట్: మీ వల్ల నా ఆస్తి అంతా పోయింది

డాక్టర్: నేనేం చేశాను?

పేషంట్: నాకు కేన్సర్ ఫైనల్ స్టేజ్ అని రిపోర్ట్ ఇచ్చారు కదా. ఇక నేను బతకను కాబట్టి చనిపోయిన తర్వాత ఆస్తి ఎందుకని, జల్సాలు చేసి ఆస్తంతా కరిగించాను. మీరు ఇచ్చిన రిపోర్ట్ చూడండి.

డాక్టర్: రిపోర్ట్‌లో కేన్సర్ అనే ఉంది కదా?

పేషంట్: కానీ పేరు వేరే వాడిది ఉంది. రిపోర్ట్స్ మారాయి..!

–ఎస్ కె.యాకూబ్ పాషా, ఖమ్మం

## రెమ్యునరేషన్

డైరెక్టర్: "కళాశ్రీ! నీది ఈ సినిమాలో మూగపాత్ర" అన్నాడు.

కళాశ్రీ: "పాత్ర సంగతే సరేగానీ రెమ్యునరేషన్ మాత్రం తగ్గించకండి"

"కాంతం, నేను మా ఫ్రెండ్ రాజు ఓ పందెం వేసుకున్నాం"

"ఏం పందెమండీ?"

"నేను మా ఆవిడని తిట్టినా తిరిగి నన్ను తిట్టదని.."

"అయితే నాకు నెక్లెస్ చేయిస్తానని మాటివ్వండి మరి.."

– వైదా ఈశ్వరరావు, విశాఖ

## 'సంఘీ' భావం



# ఆన్‌లైన్ గేమింగ్‌పై కేంద్రం కన్నెర్ర

**ప్రస్తుతం** యువత ఆన్‌లైన్ గేమింగ్ పట్ల ఆకర్షితులౌతున్నారు. సరదాగా మొదలుపెట్టిన ఈ గేమింగ్ వ్యసనంగా మారి వారి ప్రాణాలను సైతం హరించివేస్తోంది. దేశవ్యాప్తంగా వారానికి కనీసం వంద మందికిపైగా ఆన్‌లైన్ గేమింగ్ బారిన పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

వాస్తవానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది. పైగా ఈ ఆన్‌లైన్ గేమింగ్ ప్రముఖ సినీ నటులు, పేరొందిన ఇన్‌ఫ్లూయెన్సర్‌లు కూడా మద్దతుగా ప్రకటనలు చేయడంతో మరింత ఎక్కువ సంఖ్యలో ప్రజలు వీటి బారిన పడుతున్నారు. ఈ అన్‌లైన్ గేమింగ్‌ను పూర్తి స్థాయిలో అరికట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ యాప్‌లపై పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి ఈ గేమ్స్ వల్ల కలుగుతున్న నష్టాలకు సంబంధించి పూర్తి నివేదికను సిద్ధం చేసుకుంది.

ఆన్‌లైన్ గేమ్ పూర్తిగా నిషేధించడానికి వీలుగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025'కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ను అడ్డుకోవడం, ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేయడమే దీని ప్రధాన లక్ష్యాలు. గేమింగ్ యాప్‌ల నిర్వాహకులపైనా, దానికి మద్దతుగా ప్రకటనలు చేసి యువతను ఆకర్షిస్తున్న సినీ నటులు, ప్రముఖ ఇన్‌ఫ్యూయెన్సర్లపై కూడా కఠినంగా వ్యవహరించి, న్యాయస్థానాల్లో శిక్షలు వేసేందుకు అవకాశం కలుగుతుంది. గత కొన్ని నెలల్లో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లతో ముడిపడిన మోసపూరిత వ్యవహారాలు పెద్దసంఖ్యలో వెలుగులోకి వచ్చాయి. వాటిని ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలపై దర్యాప్తు సంస్థలు కొరడా ఝుళిపిస్తున్నాయి.

ఇప్పటికే తెలంగాణలో అనేక మంది సెలబ్రిటీలను పోలీసు అధికారుల ప్రత్యేక బృందం ప్రశ్నిస్తోంది. వారి బ్యాంకు అకౌంట్లోను పరిశీలించి గేమింగ్ యాప్‌ల నుంచి ఏ మేరకు ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న అంశంపై పరిశీలన జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌ను, దానికి వేదికగా నిలిచే యాప్స్‌కు సంబంధించిన అడ్వర్టైజ్‌మెంట్లను కేంద్రం పూర్తిగా నిషేధం విధించే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ రియల్ మనీ గేమింగ్ యాప్‌లకు యువత బానిసలుగా మారుతున్నారు. తమ విలువైన డబ్బును బెట్టింగ్‌లో పెట్టి ఆర్థికంగా దివాలా తీస్తున్నారు. రియల్ మనీ గేమింగ్ యాప్‌లు సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌లతో ఆకట్టుకునే యాడ్‌లు, ప్రజల్లో ఈజీ మనీ ఆశలను పెంచుతున్నాయి. వీటిని నిజమేనని నమ్మి ఎంతోమంది యువత రియల్ మనీ గేమింగ్ యాప్‌లలో బెట్టింగ్ కాస్తున్నారు. చివరకు ఈ వ్యసనపు ఊబిలో కూరుకుపోతున్నారు. పలు రియల్ మనీ గేమ యాప్‌లు ఆర్థిక మోసాలకు, ఇతరత్రా అవకతవకలకు గురవుతున్న దాఖలాలు కూడా గత కొన్ని నెలల్లో వెలుగులోకి వచ్చాయి. ఆర్థిక అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం నుంచి యువతను రక్షించే లక్ష్యంతో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుఖను కేంద్రం ప్రభుత్వం రూపొందించిన్నిది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినా, యాడ్‌లను ప్రచారంలోకి తెచ్చినా బాధ్యులకు జరిమానాలు, శిక్షలను విధించాలనే ప్రతిపాదన ఉంది. దీనితో ఈ యాడ్‌లను పూర్తిగా నిషేధించే ఛాన్స్ ఉంది.

రియల్ మనీ గేమింగ్ యాప్‌లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు బ్యాంకులు, ఆర్థిక సేవా సంస్థలు వేదికగా మారకూడదనే నిబంధన బిల్లులో ఉండే అవకాశం ఉంది. స్కిల్, ఛాన్స్ అనే అంశాలతో సంబంధం లేకుండా డబ్బుతో జరిగే అన్ని రకాల ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్‌లను, బెట్టింగ్ యాప్‌లను ప్రత్యేక కేటగిరీ కింద కేంద్రం ప్రభుత్వం వర్గీకరించే అవకాశం ఉంది. ఈ లెక్కన డబ్బుతో ముడిపడిన లావాదేవీలు కలిగిన పోకర్‌బాజీ, రమ్మీ, డ్రీమ్ 11, ఎంపీఎల్, పారిమ్యాచ్ వంటి ప్రసిద్ధ ఆన్‌లైన్ కార్డ్ గేమ్ ప్లాట్‌ఫామ్‌లు కూడా ఉండే అవకాశం ఉంది.

భారత్‌లో ఆన్‌లైన్ గేమింగ్‌పై ప్రభుత్వ సంస్థగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖను నియమించాలనే ప్రతిపాదన ఉంది. గతంలోనూ ఈ విషయాన్ని ఇదే శాఖ పర్యవేక్షించేది. ప్రస్తుతం బిల్లును తీసుకురావడం ద్వారా ఆన్‌లైన్ గేమింగ్‌ను భారతదేశంలో పూర్తిగా అడ్డుకట్ట వేయాలని కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్‌స్టోరీ

# కాంతి దాతలు.. శాంతి దూతలు గురువులే

జంధ్యాల శరత్‌బాబు

**గురుదేవ.. గురువునే దైవంగా భావించడం. విశ్వ కళాక్షేత్రంలో విజ్ఞానం నిండించేది, విద్యార్థినీ విద్యార్థుల మదిలో బంగారం పండించేదీ గురువే! ఉపాధ్యాయుడు, బోధకుడు, అధ్యాపకుడు, శిక్షకుడు, ఆచార్యుడు, ప్రాచార్యుడు.. ఇలా ఎన్నో పేర్లు. ఏ స్థాయిలోనైనా, ఏ దశలో అయినా గురువు గురువే; బోధన ప్రాధాన్యం బోధనదే. జగతి ప్రగతి మార్గంలో జైత్రయాత్ర సాగించాలన్నా, జనహృదిలో విజయభేరి మోగించాలన్నా ఆ శక్తీ యుక్తీ గురువర్యునికే. ఉర్వికెల్ల కాంతిదాత, అచ్చమైన శాంతిదూత టీచరే. పురుషులైనా, మహిళలైనా ఆ 'టీచింగ్' ప్రతీ బాలికకీ, బాలుడికీ జీవితమంతా గుర్తుంటుంది. ఒకే ఒక్క మాటలో టీచర్లు 'వైతాళికులు'. విద్యాలయం లోపలా, వెలుపలా జీవన రీతిని తీర్చిదిద్దే మార్గదర్శకులు. సెప్టెంబరు ఐదున భారత జాతీయంగా, సరిగ్గా నెల రోజులకు అక్టోబరు ఐదున ప్రపంచ వ్యాప్తంగా ఊరూ వాడా ఉపాధ్యాయుల దినోత్సవం. 'ఆచార్య దేవోభవ' కర్త అన్నట్లు విద్యాబుద్ధులు నేర్పేవారి మాట వరాల మూట! గురువుల సన్నిధే విద్యార్థులకు పెన్నిధి.**

కాలం అనేది నిరంతర జీవధార. ఆగకుండా సాగుతూనే ఉంటుంది. అంతటి వేగ గమనంలో ఆగేదీ ఒక్కోమారు దారి మళ్లేదీ మనిషే. నిత్యకృత్యాల పెను ఒత్తిళ్ల మధ్య అతను/ఆమె పరిభ్రమించడమే లోకరీతి. ఆ భ్రమణ పర్వంలో అజ్ఞాన తిమిరాన్ని తొలగించి విజ్ఞాన దీపాన్ని వెలిగించడమే గురు లక్ష్యం, లక్షణం. మేలుకొలుపు పాడి, మేలిమి బాటన నడిపించినందునే గురువుకి ఇంతటి దైవత్వం. బాల్యంతో పాటు యౌవన, కౌమార, వార్ధక్యం దశలన్నింటా లెక్కకు మిక్కిలి అనుభూతులు, అనుభవాలు. వీటిలో మరపురానివి పాఠశాల దశలో అనేకం. అందుకే ప్రాథమిక స్థాయిన గురువులెవ్వరినీ మనం మరవలేం. వారిని తలవకుండా ఉండలేం!

మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవం ఉత్సాహం సెప్టెంబరు ఐదున అంతటా వెల్లివిరుస్తుంది. ఆ రోజునే ఎందుకంటే సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు; వ్యక్తిగతంగా తనకు కాదు.. 'ఉపాధ్యాయులందరికీ' ఉత్సవం చేయండని చెప్పిన రోజు. "ఎప్పుడైనా స్పష్టమైన ఆలోచన బోధకుడు పొత్తు" అనేది ఆయన నిశ్చిత అభిప్రాయం. అంతకుమించి ప్రగాఢ విశ్వాసం. అందువల్లనే దేశంలో ఉపాధ్యాయ దినోత్సవానికి అంతటి సుప్రసిద్ధత. ఆంధ్రా విశ్వవిద్యాలయంతో పాటు బెనారస్ హిందూ వర్సిటీకీ ఉప కులపతిగా పని చేశారాయన. మద్రాసు కళాశాలలో తత్వశాస్త్ర బోధన చేసిన ఆచార్యవర్యులు. కోల్‌కతాలోనూ బాధ్యతలు నిర్వర్తించారు. అప్పుడే 'భారతీయ తత్వశాస్త్రం' పేరిట గ్రంథ రచన చేశారు.



సావిత్రీబాయి పూలే

ఒక సందర్భంలో మాతృభాష గురించి మాట్లాడుతూ "మనల్ని ఎప్పుడూ కలిపి ఉంచేది అమ్మభాష మీది అభిమానమే" అనడం ఆయన గురుత్వానికి ప్రతీక.

ఉపాధ్యాయ వృత్తికి ఆయన తెచ్చిన గుర్తింపు, గౌరవం అపారం. 'ఆదర్శవాది జీవిత దృక్పథం' అంటూ భాష, బోధన, శాస్త్రం, కళలు, ప్రయోజనాలకు సంబంధించిన అభిప్రాయాలను విపులీకరించారు. ఆత్మకథ 'సత్యశోధన'లో సైతం బోధన అనుభవాలను విపులీకరించారు (ఉదాహరణలతో సహా). ఇంతింత ఘనతర చరితను సొంతం చేసుకున్న ఆయన చదువుకున్నది తిరుపతిలోని ఒక పాఠశాలలో. ఉపకార వేతనాలతోనే విద్యాభ్యాసమంతా కొనసాగింది. మద్రాసులో అధ్యాపకుడిగా చేరినపుడు వయసు ఇరవై యేళ్లు. నిత్యమూ గంటల తరబడి చదివేవారు. కళాశాల యువతను ఎంతగానో ఆకట్టుకునేలా పాఠాలు చెప్పేవారు. రూపొందించి, సభావేదికల పైన సమర్పించిన పరిశోధన పత్రాలూ లెక్కలేనన్ని. మైసూరు ప్రాంతంలోనూ యూనివర్సిటీ యువతరం రాధాకృష్ణన్ బోధన వినేందుకు ఎంతెంతో ఉత్సుకత చూపడం విశేషాంశం. శిష్యవాత్సల్యానికి ప్రతిగా ఎంతటి అద్భుత గురుదక్షిణ లభించిందో తెలుసుకుందాం.

## మాటా, బాటా ఒకటే!

అప్పట్లో రాధాకృష్ణన్‌కు మైసూరు నుంచి కోల్‌కతాకు బదిలీ అయింది. అప్పుడు ఆయన ప్రొఫెసరుగా ఉంటుండేవారు. వీడ్కోలు పలికేందుకు వందలాది విద్యార్థులు తరలివచ్చారు. యంత్రం వాహనం కాదు, ఒక గుర్రపు బండిని అందంగా అలంకరించారు. పలు రకాల పూలతో ఆసాంతం దిద్దితీర్చారు. బండిలో గురువును కూర్చోబెట్టి ప్రయాణమై వెళ్లే రైల్వే స్టేషన్ వరకు బండిని లాగుతూ తీసుకెళ్లారు. కాలు కింద పెడితే కందిపోతుందా? అన్నంత అపురూపంగా చూసుకున్నారు. అందులో మానవ శ్రమ కన్నా గౌరవాభిమానాలు వ్యక్తమయ్యాయి. అదంతా తనలోని బాధ్యతాయుతపు ప్రవృత్తిని రెట్టింపు చేసిందని, మంచిమాట–మేలిమి బాటను పరుస్తుందని తేటతెల్లమైందనీ స్వీయ చరిత్రలో రాసుకున్నారాయన. తన బోధనాంశాలను శిష్యులు ఆచరణకి తేవడమే నిజమైన గురుసత్కారమని వ్యాఖ్యానించారు.

**ప్రాచ్య పాశ్చాత్య తత్వ జ్ఞాన సమ్యక్**
**సమన్వయంబడిన మహా మనస్వి!**
**ఖండ ఖండాంతర ఖ్యాతమౌ**
**దివ్య వాగమృతంబు కురియు.. అహో యశస్వి!**
**జ్ఞాన నిష్ఠకు కర్మ సంధానమందించు**
**ఆత్మజ్ఞుడైన నవ తపస్వి!**
**పరమ శాంతోదార పరిపూర్ణ**
**భావ వాంతర్యమెరుగు జయ వచస్వి!**
**ధర్మ సంస్కృతి తెలుపు అద్వైతమూర్తి !**
**అఖిల తత్వమ్ము నరయు మహామనీష**
**నిండి వెలుగు రాధాకృష్ణ పండితేంద్ర!**

అని అక్షరాంజలి సమర్పిస్తోంది విద్యార్థి లోకమంతా. సర్వేపల్లిది నాలుగు దశాబ్దాల అధ్యాపకత్వం. అన్ని విద్యలకూ కీలకం వ్యక్తిత్వ నిర్మాణం అనేవారు. ఉన్నతస్థాయి మనస్కులే ఉపాధ్యాయులుగా ఉండాలని కోరుకున్నారు. పుస్తకాలను సాంస్కృతిక వారధులుగా అభివర్ణించారు. జ్ఞానం మనకు శక్తి ఇస్తే, పరిపూర్ణతనిచ్చేది ప్రేమతత్వమేనని చాటిచెప్పారు. అసలైన గురువులు ఆలోచనల వ్యాప్తికి కారకులని ప్రస్ఫుటం చేశారు. నైతిక మార్పు తెచ్చేదీ ఉత్తమ విద్యా విధానం. ఆచరణకు తేవాల్సింది బోధకులేనని ప్రకటించారు. మంచి పనులకు పునాది క్రమశిక్షణ. అది ఉపాధ్యాయుల వల్లనే లభిస్తుందన్నది నాడూ నేడూ ఏనాడూ అక్షర సత్యం. "నీ భవితను నువ్వే నిర్ణయించుకో" అని చెప్పే వ్యక్తి టీచరే! బాలలు మొదలు అందరికీ ఇచ్చే సందేశం, ఉపదేశం ఇదే.

## జాతీయ, అంతర్జాతీయ ప్రశస్తి

'టీచర్స్ డే' అంటే కేవలం సభలూ, సమావేశాలూ కాదు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాల పరంపరలు మాత్రమే కావు. నిజానికి ఇదే సెప్టెంబరు నెలలో అర్జెంటీనా, చైనా, హాంకాంగ్, సింగపూర్‌లలోనూ



ఉపాధ్యాయ దినోత్సవాలు జరుగుతాయి. అంతర్జాతీయంగా అక్టోబరులో ఆస్ట్రేలియా, అజర్‌బైజాన్, బ్రెజిల్, చిలీ, లిథువేనియా, పాక్, ఫిలిప్పైన్స్, పోలండ్, రష్యా దేశాల్లో జరుగుతుంటాయి. ప్రపంచ దినోత్సవం నిర్వహణ విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ (ఐక్యరాజ్యసమితి అనుబంధం) నుంచి మొదలైంది. దరిదాపు ఆరు దశాబ్దాల క్రితం ప్యారిస్‌లో ఏర్పాటైన ప్రత్యేక సదస్సు ప్రపంచంలోని ఉపాధ్యాయుల స్థితిగతులను చర్చించింది. సమగ్ర పత్రాన్ని రూపుదిద్ది ఆమోదించిన తేదీ అక్టోబరు ఐదు. ఆ కారణంగానే విశ్వవ్యాప్త దినోత్సవాన్ని ఏటా ఆ రోజున నిర్వహిస్తున్నారు. విద్యాలయాల బోధకుల బాధ్యతలు, హక్కులను గుర్తు చేస్తున్నారు. వారి హోదాను పెంపొందించడం కీలక అంశం.

## జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఇదే ప్రధానం!

నినాదాలూ.. విధానాలూ.. ఈ సందర్భంలో పాఠశాలల, కళాశాలల, విశ్వవిద్యాలయాల బోధకుల పని పరిస్థితులను చర్చిద్దాం. "అందరికీ నాణ్యమైన విద్య" నినాదంగా ముందుకొచ్చింది 2019 జాతీయ విధానం. పారదర్శక రీతిన ఉపాధ్యాయ నియామకాలు జరపాలంది. పనితీరు అంచనాలు, మదింపులతో పదోన్నతులు ఉంటాయంది. శిక్షణకు సంబంధించి, అత్యాధునిక విధానాలు అనుసరిస్తామంది. వృత్తి పరంగా టీచర్ల సంఘాలను సుశిక్షితం చేయాల్సిన అవసరాన్నీ నొక్కి చెప్పింది. బలోపేతం చేయడమన్నది ఇందులో అంతర్లీనం. ఉన్నత విద్యాపరంగా ఏకీకృత వ్యవస్థకు చర్యలు తీసుకుంటామనీ హామీనిచ్చింది. సృజన, నైపుణ్య శక్తులకు పెద్ద పీట వేస్తామంది. ఈ ఏడాది(2025) చివరి నాటికి సగం శాతం అభ్యాసకులకు వృత్తి విద్యను అందించాల్సి ఉంటుందన్న మాట. భారతీయ భాషల ఉన్నతీకరణ, దీటుగా శాస్త్రాల విస్తరణనూ ప్రతిపాదించింది.

ఆశలూ, ఆశయాలూ ఎన్నో ఉన్నాయి. ఊరిస్తూ ఎదుట కనిపిస్తున్నాయి. విద్యా మంత్రిత్వశాఖ పరిధిలో చేయాల్సినవి లెక్కలేనన్ని. బాలబాలికల్లో అభ్యాస సంక్షోభాన్ని నివారించాలని కేంద్రం, రాష్ట్రాలు తమ వంతు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయి. అవి ఏ మేరకు సఫలీకృతం అయ్యాయనేది ఇప్పుడు మన కళ్లకు కడుతూనే ఉంది. ఇందులో బోధకుల బాధ్యత అత్యంత ప్రథమం.

ప్రతీ తరగతి గదిలోనూ విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి ఆశావహంగా ఉండాలి కానీ ప్రస్తుతం అటువంటి 'వాతావరణం' ఎక్కడుంది?



వచ్చే 2030 నాటికి (మరో ఐదేళ్లకు) సార్వత్రిక నాణ్యానాయుత విద్య అనేది కాగితాల్లో నలుగుతోంది ఇంకా. విద్యాహక్కు చట్ట విస్తరణలు, సమాజ అవసరాలకు తగిన రీతిలో పాఠ్య ప్రణాళికలు, ఉపాధ్యాయ వృత్తికి భరోసాలన్నవీ నాయకుల ప్రకటనల్లోనే వినవస్తున్నాయి. ఏ మార్పుకైనా మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులే. 'బలమైన ప్రక్రియ ద్వారా వారి నియామకాలు' వాగ్దానాలకే పరిమితం కాకూడదు. మరో విషయం.. పాఠశాల/కళాశాల పనివేళల్లో ఎటువంటి అవాంతరాలూ లేని బోధన. ఇది ఎంత వరకు సుసాధ్యమవుతోందో పలు అనుభవాలే వెల్లడిస్తున్నాయి.

## అనుదినానుబంధం

ఉపాధ్యాయునికీ, 'కాలసూచికకీ అవినాభావ సంబంధముంది.

**'ఆ గడియారం ఆగేది కాదు; కాలంతో పాటు సాగేది**
**చేతికి పెట్టుకున్నా, టేబుల్ మీద పడుకోబెట్టినా**
**దాని చలన శీలంలో మార్పంటూ ఉండదు**
**పగలైనా రాత్రి అయినా సచేతనమే.**
**గడియారమే ఉపాధ్యాయ దినచర్యకు దిక్సూచి**
**ఎవరైనా ఎప్పుడైనా బద్ధకించి**
**నియమ ఉల్లంఘన చేసినపుడు గడియారం**
**మౌనంగా హుంకరిస్తుంది**
**కార్యక్రమాలను నిర్దేశించేది డైరీ అయినా**
**సారథ్యం వహించేది మాత్రం గడియారమే**
**అదృశ్యంగా కదిలిపోయే కాలానికి**
**అదొక దృశ్య ప్రతీక, వృత్తి నిబద్ధతకు పతాక'**

అధ్యాపక నియామక ప్రక్రియ అంతా విద్యా విషయ నిపుణుల ఆధారంగా జరగాల్సి ఉన్నా, పరిస్థితులు వేరుగా గోచరిస్తున్నాయి. స్వేచ్ఛాయుత పరిశోధనలు, వేతనాల నిర్వహణలు, క్షేత్ర స్థాయి ప్రయోజనాల రీత్యా జరిగినవి కొన్నే; ఇంకా జరగాల్సినవి ఎన్నెన్నో. విద్యా రంగంలో సంసనకరణల పేరుతో నిత్యమూ మార్పు చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. వాటి ఫలితాలు మటుకు ఎవరికీ అంతుపట్టని రీతిలో ప్రత్యక్షమవుతున్నాయి. బోధకుల సర్వీసు నిబంధనలకు సంబంధించి, ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇప్పటికీ ఉన్న అసంబద్ధతను తొలగించాలనీ సంఘాలు నినదిస్తున్నాయి, ఉద్యమిస్తున్నాయి. ఉన్నతీకరించిన భాషా పండితుల పోస్టులను పదోన్నతులతో ప్రభుత్వం పూరించాలంటున్నాయి. తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని ఉభయ తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) ఉపాధ్యాయ బంధాలూ కోరుతూనే ఉన్నాయి. బడిపిల్లల అవసరాల మేర టీచర్ల ఖాళీలను భర్తీ చేయడం, ఇతరేతర పనిభారాన్ని తగ్గించడం, బోధనతో సంబంధం లేని వాటిని పరిహరించడం, పాఠశాలల్లో రాజకీయ జోక్యాన్ని నియంత్రించడం అనేవీ మరికొన్ని విన్నపాలు.

## సంతృప్తి ఎప్పుడు, ఎక్కడ?

వీటన్నింటి రణగొణల నడుమ మళ్లీ ఇప్పుడు ఉపాధ్యాయ దినోత్సవం వచ్చేసింది. విద్యా వికాసం అనే పదమైతే పరివ్యాప్తమైంది. స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల అంశమూ విస్తృత చర్చకొచ్చింది. చట్టాలు, నియమాలు, నిబంధనలు, సంస్కరణలు- వీటి మాట ఎలా ఉన్నా- ఉపాధ్యాయులకు వృత్తి పరమైన సంతృప్తి మిగులుతోందా? అన్నదే ప్రశ్న. వారు సరిగ్గా పాఠాలు చెప్పడం లేదని తల్లిదండ్రులు, చేయాల్సినవి ఇంకా చేయడం లేదని విద్యాశాఖ అధికారులు, ఇది చాలదన్నట్లు నానా రకాల కార్యక్రమాల జోరూ శిక్షణ పరంపరల హోరుతో ఉపాధ్యాయ హృదయం ఉక్కిరి బిక్కిరవుతోంది. పిల్లలకు భయభక్తులు నేర్పడమన్నది టీచర్లకు సవాలుగా మారుతోంది మరి. ఈ మాదిరి స్థితిలో ఒకరోజు ఉత్సవంతో ఒరిగేదేమిటి?



## బోధక వృత్తిని ఎవరైనా ఎందుకు ఎంచుకుంటారు?

* విద్యార్థుల మీద శాశ్వత ప్రభావం ఉంటుందని.

* ఉపాధ్యాయ వృత్తిలో స్థిరత, భద్రత తగినంత కలుగుతుందని.

* ప్రవీణత, నిపుణతకు ఆస్కారం ఏర్పడుతుందని.

* ఏ రోజుకు ఆ రోజు బోధనలో సంతృప్తిని ఆస్వాదించవచ్చని.

* పిల్లలకు మంచి భవిష్యత్తు చూపాలని, మేలు చేయాలని.

* పరీక్షలను ఎదుర్కొనేలా తయారు చేయాలని, పటిమను పెంచాలని.

ఇవాళ ఎదురవుతోంది ఏమిటి? అసలంటూ ఏం జరుగుతోంది?

* పిల్లల ప్రవర్తనను నియంత్రించడం కష్టతరమవుతోంది. వాళ్ల కట్టూ-బొట్టూ వేష భాషల గురించి ఏ ఉపాధ్యాయుడూ నోరు తెరవలేని పరిస్థితి.

* బడిలోపలా, వెలుపలా కూడా టీచర్లకు అభద్రత. పాఠశాల వ్యవహారాల్లో ఊరి రాజకీయాలు, అధికారులు తెచ్చే రోజువారీ ఒత్తిడితో కలత.

బోధనేతర పనులు, ఏవేవో గణాంక సమీకరణలు, విద్యార్థుల పరీక్షలతో ప్రమేయం లేని నానా రకాల కార్యక్రమాలతో విసిగివేసారుతున్నారు టీచర్లు.

* విధుల కేటాయింపు, చీటికీ మాటికీ మార్చడం, బదిలీల తీరుతెన్నులు, కొన్ని ఉపాధ్యాయ సంఘాల అత్యుత్సాహం వల్ల అవస్థలు.

* ఎక్కడ ఏ సభ జరిగినా పిల్లలను తలించడమన్నది ఇంకా సంభవిస్తోంది. బడిలోపల ఉండాల్సిన వాళ్లను వెలుపలికి రప్పించి, నాయకులకు స్వాగతాలంటూ ఎండల్లో నిలబెడుతుండటం ఎక్కువవుతోంది. దీనికి ఉపాధ్యాయులను వినియోగించడమన్నది అన్ని విధాలా శోచనీయమే.

* ఉత్తీర్ణత శాతం పెంచడమన్నది టీచర్ల బాధ్యతే. అలా అని వారి మీద ఒత్తిళ్లు పెంచి ఆరోగ్యం దెబ్బ తినేలా చేయడం క్షంతవ్యం కాదు. అధికార వర్గాలు, రాజకీయ ప్రాబల్యాలు కలగలిసి విద్యా వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి.

## ప్రదాన మాధురి



దాదాపు ఒకటిన్నర దశాబ్దం కిందట తెలంగాణ భాగ్యనగరంలో గురుపూజోత్సవాలు అంగరంగ వైభవంగా ఏర్పాటయ్యాయి. శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మమ్మ మహిళా కళాశాల (రాజమహేంద్రవరం) అధ్యాపకురాలు డాక్టర్ జె.లలిత భారతి 2012 సెప్టెంబరు ఐదో తేదీన అప్పటి పాలక ప్రముఖుల చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక పురస్కృతిని స్వీకరించారు. ఆ వేదిక హైదరాబాద్‌లోనిది, నిర్వహించింది అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ. అనంతర కాలంలో ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రతీ వత్సరం పురస్కార ప్రదానోత్సవాలు ఏర్పాటవుతున్నాయి. గురు-శిష్య స్ఫూర్తికి ఉదాహరణలవుతున్నాయి. ప్రదాన సందర్భాల్లో నేతలు తమ గురువులను తలచుకుని భావోద్వేగాలకు లోనైన దృశ్యాలు ఎన్నో! ఈ సంవత్సరం అవార్డుల పరంగా ఎంపిక ప్రమాణాలు నిర్దేశించారు. మార్గదర్శకాలను జారీ చేశారు, విధానాన్ని రూపుదిద్దారు.

## ఉత్తమత్వానికి బహుకృతి

ఉదాత్త వృత్తి-బోధన. ఆ ఉత్తమత్వానికే ప్రభుత్వాలు ఏటా పురస్కారలిచ్చి సత్కరిస్తున్నాయి. జాతీయంగా గౌరవాదరాలు అందచేస్తున్నాయి. అంతర్జాతీయంగా పేరొందిన గురూత్తముల్లో న్యూటన్ శాస్త్ర సిద్ధాంత కర్త. స్వతహాగా ఉపాధ్యాయుడు. సంఖ్యల పితామహుడుగా పేరొందిన పైథాగరస్ బోధకుడు. భౌతిక శాస్త్రంలో పరమోన్నత నోబుల్ పురస్కృతిని



అందుకున్న ఐన్‌స్టీన్ ఒక టీచరు. బహుముఖ ప్రజ్ఞాశాలి. అరిస్టాటిల్ ఉపాధ్యాయుడు, విద్యా సంస్థ స్థాపకుడు కూడా. మన దేశానికి చెందినంత వరకూ తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి ఫూలే. ఎందరో మహనీయులు. వారందరికీ వందనాలు.

అనుభవశీలతను గుర్తించి గౌరవించాలందరూ. నిజాయితీ నిబద్ధతలకు గుర్తింపునివ్వాలి ఎప్పుడూ. నిరుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉభయ రాష్ట్రాల నుంచీ నలుగురు ఎంపికయ్యారు. వారికి గురుపూజ ఉత్సవం రోజున నగదు మొత్తం, పతకం, ప్రశంసా పత్రంతో ఘన సత్కారాలు చేశాయి తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు. విజేతల్లో ఒకరిది ప్రయోగాత్మక విద్యాబోధన. మరొకరిది సాంకేతిక పరిజ్ఞాన వినియోగ చాతురి. ఇంకొకరిది బాలలను అనేకానే పోటీల్లో విజేతలను చేసిన దక్షత. వేరొకరిది శాస్త్రీయ అవగాహన పెంచడంలో కృషి.

ప్రతీ సంవత్సరం పదుల సంఖ్యలో రాష్ట్ర స్థాయి పురస్కారాలిచ్చి, క్రమంగా వాటిని శతాధికంగా మలచి, ఉత్సాహపూరితంగా వ్యవహరిస్తున్నాయి రెండు ప్రభుత్వాలు. బోధక దినోత్సవం ఆ ఒక్కరోజే అని కాకుండా నిరంతరమూ వెలుగులీనాల్సిందే. అందుకు సమాజంలోని అందరిదీ సమబాధ్యత. సర్వేపల్లివారు చెప్పిందీ ఇదే! ✦

# రాగితో విభిన్న రుచులు

## పొంగనాలు

**కావలసిన పదార్థాలు**



రాగిపిండి-ఒక కప్పు; బొంబాయి రవ్వ-ఒక కప్పు; పెరుగు-ఒక కప్పు; నీళ్లు-ఒకటిన్నర కప్పు; ఉప్పు-తగినంత; వంటసోడా- చిటికెడు; నూనె-అర కప్పు; సెనగపప్పు-అరచెంచా; మినప్పప్పు-అరచెంచా; ఆవాలు-అరచెంచా; జీలకర్ర-అరచెంచా; పచ్చిమిర్చి-రెండు; ఉల్లిపాయముక్కలు-అరకప్పు; కొత్తిమీర తరుగు-టేబుల్‌స్పూను; క్యారెట్లు-రెండు.

**తయారు చేసే విధానం**

ఓ గిన్నెలో రాగిపిండి, బొంబాయిరవ్వ, పెరుగు, తగినంత ఉప్పు వేసి, నీళ్లు పోసి కలిపి మూత పెట్టాలి. స్టవ్ మీద కడాయిని పెట్టి చెంచా నూనె వేసి సెనగపప్పు, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర వేయించుకోవాలి. ఇందులోనే సన్నగా తరిగిన పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు, క్యారెట్ తురుము వేసుకుని రెండు మూడు నిమిషాలు వేయించి దింపేయాలి. ఈ మిశ్రమం, కొద్దిగా వంటసోడా రాగిపిండిలో వేసి మరోసారి కలపాలి. స్టవ్ మీద గుంటపొంగనాల పాన్‌ను పెట్టి ఈ పిండిని వేసుకుని, నూనె వేస్తూ రెండు వైపులా ఎర్రగా కాల్చుకుని తీసుకోవాలి.

## ఊతప్పం

**కావలసిన పదార్థాలు**

రాగులు-కప్పు; మినప్పప్పు-అరకప్పు; మెంతులు-పావుచెంచా; దనియాల పొడి-ఒక చెంచా; ఉప్పు-సరిపడినంత; కారం-అరచెంచా, ఉల్లిపాయముక్కలు-అరకప్పు; క్యాప్సికం తరుగు-అరకప్పు; క్యారెట్ తురుము-అరకప్పు; నూనె-ఒక కప్పు.



**తయారు చేసే విధానం**

ముందురోజు రాగుల్నీ, మినప్పప్పునీ, మెంతుల్నీ సరిపడా నీళ్లల్లో నానబెట్టుకుని మర్నాడు గట్టి పిండిలా రుబ్బుకోవాలి. ఈ పిండిలో దనియాల పొడి, తగినంత ఉప్పు, కారం వేసుకుని కలిపి మరో నాలుగు గంటలు నాననివ్వాలి. ఆ తర్వాత స్టవ్ మీద పెనం పెట్టి ఊతప్పం మాదిరి పరిచి పైన ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికం తరుగు, క్యారెట్ తురుము చల్లుకుని, నూనెతో ఎర్రగా కాల్చుకుని తీసుకుంటే రుచికరమైన ఊతప్పం సిద్ధం.

విందు-పసందు

## పూరీ

**కావలసిన పదార్థాలు**

రాగిపిండి-కప్పు; గోధుమపిండి-కప్పు;



బొంబాయిరవ్వ-రెండు టేబుల్‌స్పూన్లు; ఉపునప-తగినంత; నూనె-సరిపడినంత.

**తయారు చేసే విధానం**

ఓ గిన్నెలో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలపాలి. ఆ తరువాత నీళ్లు పోస్తూ పూరీపిండిలా చేసుకుని పైన చెంచా నూనె వేసి మరోసారి కలిపి మూత పెట్టాలి. ఈ పిండిని పావుగంట నాననిచ్చి ఆ తరువాత కొద్దికొద్దిగా తీసుకుని పూరీల్లా ఒత్తుకుంటూ కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీస్తే పూరీలు రెడీ. ఆలుకూర్మా వీటికి మంచి కాంబినేషన్.

## అట్టు

**కావలసిన పదార్థాలు**

రాగులు-ఒక కప్పు; పెసలు-ఒక కప్పు; పచ్చిమిర్చి-రెండు; అల్లం-చిన్నముక్క; ఉప్పు-తగినంత; జీలకర్ర-రెండు చెంచాలు; ఉల్లిపాయ ముక్కలు-అరకప్పు; నూనె-అరకప్పు.

**తయారు చేసే విధానం**

ముందురోజు రాగుల్నీ, పెసల్నీ ఓ గిన్నెలో తీసుకుని సరిపడా నీళ్లు పోసి నానబెట్టుకోవాలి. మరుసటి రోజు ఈ రెండింటినీ మిక్సీలో వేసుకుని అల్లం, పచిచమిర్చితో కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. ఇందులో తగినంత ఉప్పు, జీలకర్ర కలిపి మూత పెట్టాలి. అయిదు నిమిషాలయ్యాక వేడి పెనం మీద అట్టులా వేసుకుని కాసిని ఉల్లిపాయ ముక్కలు చల్లి చుట్టూ నూనె వేయాలి. రెండు వైపులా ఎర్రగా కాలాక తీసేస్తే వేడి వేడి అట్టు సిద్ధం.



# ఏ వానకా బూటు

వర్షా కాలంలో బయటకు వెళ్లేటప్పుడు పాదాలను కాపాడుకోవడం చాలా అవసరం. మంచి చెప్పులు లేదా బూట్లు లేకపోతే ఒక్కసారి జారిపడినా పెద్ద సమస్యలు రావచ్చు. వర్షాకాలానికి తగ్గట్లుగా చెప్పులను ఎంచుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. తడి నేలపై నడిచేటప్పుడు నేలను గట్టిగా పట్టుకునేలా ఉండే మంచి గ్రిప్ ఉన్న చెప్పులు లేదా బూట్లు ఎంచుకోవాలి. ఈ రోజుల్లో మార్కెట్‌లో వర్షాకాలం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఫ్లోటర్స్, క్రోక్స్, రెయిన్ బూట్లు వంటి వాటిని చాలా మంది ఇష్టపడుతున్నారు.

ఫ్లోటర్స్ స్టైల్ చెప్పులు చాలా మెత్తగా, పాదాలకు సౌకర్యంగా ఉంటాయి. వర్షం నీటిని త్వరగా తొలగించేలా వీటిని డిజైన్ చేస్తారు. ఈ చెప్పులు బురదలో కూడా స్థిరంగా నిలబడేలా ఉంటాయి. వీటిని కడగడం కూడా చాలా సులభం. క్రోక్స్ స్టైల్ చెప్పులు తేలికైన బరువుతో, జారకుండా ఉంటాయి. వీటి ప్రత్యేక డిజైన్ వల్ల నీరు లోపలికి వెళ్లకుండా త్వరగా ఆరిపోయేలా ఉంటాయి. రెయిన్ బూట్లు పూర్తిగా నీటిని లోపలికి రాకుండా ఆపేలా డిజైన్ చేస్తారు. ఈ బూట్లు బురదలో, నీటిలో చిక్కుకోకుండా పాదాలను రక్షిస్తాయి. ఇవి పిల్లలకు, పెద్దలకు కూడా అందుబాటులో ఉన్నాయి.

### జాగ్రత్తలు

షూస్ లోపలి భాగం తడవకుండా ఉండేందుకు, వాటర్ ప్రూఫ్ మెటీరియల్‌తో చేసిన వాటిని ఎంచుకోవడం మంచిది. బూట్లు పాదాల సైజుకు సరిపోయేవి మాత్రమే ఎంచుకోండి. మంచి గ్రిప్ ఉన్న సోల్ ఎంచుకోవడం చాలా ముఖ్యం. ఇది తడి నేలపై జారిపోకుండా మిమ్మల్ని నిలబెడుతుంది. త్వరగా ఆరిపోయే పదార్థాలతో తయారైన బూట్లు మంచివి. బట్టతో చేసినవి, తడిలో త్వరగా పాడైపోయే వాటికి దూరంగా ఉండాలి. చెక్క లేదా బట్ట లాంటి వాటితో ఉన్న బూట్లు వర్షాకాలానికి సరిపోవు. వాటి బదులు ప్లాస్టిక్, రబ్బర్ వంటి వాటితో తయారైనవి ఎంచుకోండి. మంచి బూట్లు ఎంచుకోవడం ద్వారా తడి రోడ్లపై కూడా ధైర్యంగా నడవవచ్చు. పాదాల ఆరోగ్యం, భద్రతకు సరైన చెప్పులు ఎంచుకోవడం చాలా ముఖ్యం.



వైట్ షూస్‌పై కాస్తంత బురద పడినా ఎబ్బెట్టుగా కనిపిస్తాయి ఆ మరకలు. వర్షం కురుస్తున్నప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో వైట్ షూస్ వేసుకోవాల్సి వచ్చినప్పుడు బురద పడి అవి పాడైపోతే మాత్రం ఇప్పుడు చెప్పిన చిట్కాలతో సులభంగా క్లీన్ చేసుకోవచ్చు. వైట్ షూస్ కొత్త వాటిలా తళతళ మెరిసిపోవాలంటే అంతకు మించిన టిప్స్ పాటించాలి. మిగతా కలర్ షూస్ ఏమో కానీ వైట్ కలర్ షూస్ మాత్రం చాలా స్టైలిష్‌గా అనిపిస్తాయి. పైగా ఇందులో ఎన్నో మోడల్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. గతంలో షూస్ అంటే కేవలం కాన్వాస్ మాత్రమే ఉండేవి. కానీ తరవాత మార్కెట్‌లోకి కొత్త రకాలు వచ్చాయి. వీటిలో ఒక్కో రకం షూస్‌ని ఒక్కో క్లాత్‌తో తయారు చేస్తారు. కొన్ని చాలా త్వరగా మురికి పడతాయి. వాటిని శుభ్రం చేసేసరికి తలప్రాణం తోకకు వస్తుంది. వైట్ షూస్ వాడకపోయినా చాలా త్వరగా మురికి పట్టేస్తాయి. వాతావరణంలో ఉండే తేమ కారణంగా నల్లగా మారిపోతాయి. కొన్ని సార్లు వాటిపై బ్యాక్టీరియా, ఫంగస్ ఏర్పడే అవకాశం కూడా ఉంటుంది.

షూస్ క్లీన్ చేసేటప్పుడు– అవి ఏ మెటీరియల్‌తో తయారయ్యాయో గమనించాలి. రోజూ వంటింట్లో వాడే డిష్ వాష్ లిక్విడ్ కొన్ని చుక్కలు తీసుకోవాలి. వాటిని వేడి నీళ్లలో వేయాలి. లిక్విడ్ సరైన విధంగా నీళ్లలో కలిసే వరకూ వెయిట్ చేయాలి. ఆ తరవాత ఏదైనా ఓ సాఫ్ట్ బ్రష్ తో ఈ మిశ్రమాన్ని వైట్ షూస్ పై అప్లై చేయాలి. ప్రతి మూలలోనూ ఈ లిక్విడ్‌ని అప్లై చేయాలి. ఇలా చేయడం ద్వారా చాలా త్వరగా మురికి మొత్తం వదిలిపోయి తెల్లగా మారిపోతాయి.

### చిట్కాలు

అన్ని రకాల షూస్‌ని మెషీన్‌లో వేసి క్లీన్ చేయలేం. వాటిని మెషీన్‌లో వేయచ్చా లేదా తెలుసుకుని అప్పుడే ఆ విధంగా చేయాలి. సింపుల్‌గా డిటర్జెంట్ లిక్విడ్ వాడితే సరిపోతుంది. షూస్ లేబుల్‌లో అన్ని రకాల ఇన్‌స్ట్రక్షన్స్ ఉంటాయి. మెషీన్‌లో ఉతకకూడదు అని రాసి ఉంటే మాత్రం అవాయిడ్ చేయాలి. ఇలా కాదనుకుంటే ముందుగా ఓ బకెట్‌లో వేడి నీళ్లు నింపి అందువల్ల డిటర్జెంట్ లిక్విడ్ వేయాలి. వైట్ షూస్‌ని అందులో నానబెట్టాలి. కొన్ని గంటల తరవాత తీసి సాఫ్ట్ బ్రష్‌తో రబ్ చేసి ఆరబెట్టాలి. ఇలా చేసినా కొంతవరకు మురికి వదిలిపోతుంది. మురికి పట్టినచోట నిమ్మరసం పోయాలి. కాసేపు అలాగే షూస్ పక్కన పెట్టాలి. తరవాత ఓ సాఫ్ట్ క్లాత్ లేదా బ్రష్‌తో రబ్ చేయాలి. కాసేపట్లోనే మురికంతా పోతుంది. ఓ టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాని నీటిలో పేస్ట్‌లా చేయాలి. ఈ పేస్ట్ షూస్‌పై మురికి ఉన్న చోట అప్లై చేయాలి. అయితే ముందుగా 'టెస్ట్ క్లీన్' చేయడం మంచిది. షూస్ త్వరగా ఆరకపోతే, పాదాలకు ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, త్వరగా ఆరే షూస్ ఎంచుకోవడం మంచిది. వర్షంలో నడవడానికి సౌకర్యవంతంగా ఉండే షూస్ ఎంచుకోవడం ముఖ్యం. కాలి వేళ్ళు బయట ఉండే చెప్పులు/బూట్లు, పాదాలు త్వరగా ఆరడానికి, గాలి ఆడటానికి సహాయపడతాయి.

- ఆనంద 'మైత్రేయ'మ్

# అక్షరాన్ని..!

వర్ణమాలలో అక్షరాన్ని
పదాలుగా వాక్యాలుగా
జనపదమై మారుమోగాలని
నిత్యం కలలు కంటుంటాను.

కలలు నిజమవ్వాలని
అక్షరాక్షంతో స్నేహిస్తాను
పద ప్రవాహాన్ని ప్రేమిస్తాను
ఆనకట్టతో గ్రంథస్తం చేస్తే
తన్మయత్వంతో పరవశిస్తాను.

నన్నొక పిల్లన గ్రోవిలా
మోగించి ఆవుల మందను
ఆనందపరచాల్సిన జనులు
నేడు అసురులై బృందావనాన్ని
ధ్వంసం చేసి కాలరాస్తున్నారు.

పొత్తములో నా ఆత్మను
పురిటి నొప్పుల్లో తుంచేసి
అరువు బిడ్డల్ని ముద్దు చేస్తే
దుఃఖంతో మనసు విరిగి
సంద్రంలో మునిగిపోతున్నాను.

– పేరూరు బాలసుబ్రమణ్యం




## ఈ వారం కవిత్వం

# నా తోట

మొన్న నాటిన విత్తనాలు
నేడు మొలకలెత్తాయి ..
నిన్న పూసిన మొగ్గలు
నేడు విచ్చుకుంటున్నాయి..

నిన్న పట్టిన నీటికి
నేడూ పరవశిస్తున్నాయి కొమ్మలు ..
గాలి వయ్యారంగా
సయ్యాట లాడుతూ
పూల వాసనలను తోటంతా
పరుస్తోంది..

మొన్న చుట్ట చుట్టుకొన్న
గొంగళి పురుగులన్నీ
నేడు రంగు రంగుల రెక్కలు కట్టుకొని
సీతాకోకలై
విరులపై స్వరాలు పాడుతున్నాయి..

అవును..! నా అక్షరాల పూలతోటలో
నిస్సారపు స్వప్నాలు సైతం
విస్ఫారిన పుష్పాలై
విరబూస్తున్నాయి..

– రఘు కందుకూరు



# వెన్నెల వెలుగు

చీకటిని తరిమేసి
వెలుగులో బతకాలి.

అజ్ఞానాన్ని అంతంచేసి
జ్ఞానసంపద పెంచుకోవాలి.

వెలుగు బాటలో నడిచి
తెలిసిన గమ్యం చేరగలం.

అవసరంలేని అనుమానాలు
పక్కనపెట్టి పయనిస్తే
బయటా లోపలా వెలుగే !!
విజయం పున్నమి వెన్నెల

- శాంతమూర్తి

# అమ్మ

అమ్మంటే అపర సృష్టికర్త
అమ్మంటే అనురాగదేవత
అమ్మంటే అమృతమూర్తి
అమ్మంటే ఆది గురువు
అమ్మ పిలుపులో కమ్మదనం
అమ్మ మాటలో తియ్యదనం
అమ్మ గోరుముద్దలో స్వాదం
అమ్మ విశిష్ట లక్షణాలు
ప్రేమల్ని పంచేది అమ్మ
లాలించి పాలించేది అమ్మ
మురిపించి మరిపించేది అమ్మ
బుజ్జగించి తినిపించేది అమ్మ
అనుబంధాలకు ప్రతీక అమ్మ
ఆత్మీయతకు చిరునామా అమ్మ
తప్పటడుగులు సవరించేది అమ్మ
తప్పొప్పులు వివరించేది అమ్మ
అమ్మ ప్రేమకు సాటి లేదు
అమ్మ ఓరిమికి హద్దు లేదు
అమ్మకు ప్రత్యమ్నాయం కానరాదు
అమ్మకు మించిన దైవం లేదు

– పి.వి.ప్రసాద్



# సరస్వతి దీవెనకు ఇలా..

**పుస్తకం విజ్ఞాన భాండాగారం. పుస్తకం హస్తభూషనమే కాదు మస్తిష్క వికాస సాధనం. సరస్వతి కొలువైన దేవాలయం గ్రంథాలయమే. విజ్ఞాన సముపార్జనకు మూల సూత్రం పుస్తక పఠనం. జ్ఞాన వితరణ మాధ్యమం పుస్తకమే. పుస్తకాన్ని నమ్మినవాడు మహాజ్ఞాని అవుతాడు. పుస్తకాన్ని, గ్రంథాలయాన్ని వ్యతిరేకించినవాడు అపర అజ్ఞాని.**



ఒక పుస్తకం వేల మెదళ్లను వెలిగించే జ్ఞానదీపం. పుస్తకాలు కొలువుదీరి సరస్వతీ నిలయాలు గ్రంథాలయం మాత్రమే. గ్రంథాలయ దర్శనంతో మనో విస్మృతి విస్తరిస్తుంది. పుస్తక పఠన ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రతి సంవత్సరం 9 ఆగస్టు నుంచి ప్రపంచవ్యాప్తంగా 'జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం (నేషనల్ బుక్ లవర్స్ డే)'ను నిర్వహించటం ఆనవాయితీగా మారింది.

## లుక్ కల్చర్ వద్దు బుక్ కల్చరే ముద్దు

డిజిటల్ అంతర్జాల వలలో విశ్వమే కుగ్రామం అయ్యింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. గూగులమ్మ ఒడిలో పుస్తకాలు దాక్కుంటున్నాయి. బుక్ కల్చర్ మాయమై లుక్ కల్చర్ ప్రత్యక్షం అవుతున్నది. గ్రంథాలయాలు అనాథలు అయిపోతున్నాయి. పుస్తకాలు నిరాదరణతో చిన్నబోతున్నాయి. చందమామ కథలు, బాలమిత్ర మొదలైనవి అంతరించాయి.

బామ్మ ఒడికి దూరమై గూగులమ్మ పంచన చేరుతున్నారు యువత. పిల్లలతో పాటు పెద్దలు సహితం పుస్తక పఠనాన్ని త్యాగం చేసి చరవాణి/ల్యాప్‌టాప్/ట్యాబ్‌లతో స్నేహం చేస్తున్న విచిత్ర ఏఐ యుగం నడుస్తున్నది.



## పుస్తక పఠన ప్రయోజనాలు

ఒకసారి పుస్తక పఠన సాగర ఈతను ప్రారంభిస్తే, విషయ పరిజ్ఞాన తీరాలకు చేరుతూ విజేతలుగా నిలవడానికి ప్రయత్నించాలి. పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంచగల ఇతర పుస్తకాలు, మ్యాగజైన్స్, పత్రికలు ప్రతిరోజూ చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తకాన్ని చదివిన వారిని జ్ఞాన సరస్వతి దీవిస్తూ, ఉజ్వల భవిష్యత్తు, సమాజ గుర్తింపులను అందజేస్తుంది.

పుస్తక పఠన అభిరుచితో ఓపిక, జ్ఞాన సంపన్నత, ఏకాగ్రత, విద్యావంతులుగా ఎదగడం, మేధో వికాసం ఫలించడం సహజంగానే జరుగుతుంది. పుస్తక పఠనం మెదడుకు వ్యాయామంగా పని చేసి చురుకుగా మార్చుతుంది. పుస్తక ఫలవంతమైన ఓ ఉత్సవంగా వర్ధిల్లుతుంది. పఠనం భారం కాదు, పరమానంద భరితం.

పుస్తకాలను ప్రేమించిన వారిని ప్రపంచం అక్కున చేర్చుకుంటుంది. పుస్తక పఠనాన్ని బాల్యం నుంచే అలవాటు చేయాలని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలి. కత్తిని పదును చేయడానికి ఆకురాయి కావాలి. మెదడు చురుకుదనం పెంచడానికి పుస్తక పఠనం తోడవ్వాలి. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం, పారిభాషిక పదకోశం, ఆత్మవిశ్వాసం, లోకజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య వికాసనం, జనరల్ నాలెడ్జ్, ఆకర్షణీయ వేతనం, సమాజంలో ఉన్నత స్థానం, కుటుంబ సంక్షేమం, వ్యక్తిత్వ అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు అప్రయత్నంగా, సులభంగా పెరుగుతాయి.

నేటి ఆధునిక యువత గ్రంథాలయ దర్శనం చేస్తూ పుస్తకాల పఠన ప్రపంచంలో మునిగి, జ్ఞాన సాగరం ఈది, ఎవరెస్టు శిఖరమంత ఎదిగి, రేపటి విజ్ఞాన వివేకవంతుల సమాజ స్థాపనకు బాటలు వేసి భవిష్యత్తుకు బాధ్యత కలిగిన విజ్ఞానవంతులను దేశానికి అందజేద్దాం, పుస్తకాన్ని నిత్య నేస్తంగా అక్కున చేర్చుకుందాం.

**- డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి**

# మట్టిలో మొలిచిన వన వెలుగులు



పూలు మాట్లాడవు.. కానీ మనస్సు గొంతుతో వినిపించే కవితలు. ఒక్కొక్క చెట్టు జీవితం అంటే ఒక కథ. చెట్టు నాటిన భూమి వేరైనా, వాసనలు మాత్రం గాలి మీద వేసే కలలే. మన ఊరి పూలు మనకు ఊహలకు రెక్కలిస్తే, విదేశాల చెట్లు మనిషి హృదయాలను కలుపుతాయి. ప్రపంచం చిన్నదైపోయింది అంటే ఇదే. పువ్వుల పరిమళంలో మన దేశాల మధ్య గల దూరాలు కొట్టుకుపోతున్నాయి.

తలల మీద ముత్యాల తియ్యని వాసనలతో దేవాలయాల చుట్టూ తలదాచుకుంటూ కనిపించే చెట్టు చామంతి. తెలుపు, పసుపు రంగులలో మనసుని పరవశింపజేసే ఈ పువ్వు మన ఊర్ల సంస్కారంలో భాగమైపోయింది.

మట్టి వాసన కలిసిన ఈ పూల వాసన యజ్ఞాలలోనూ, పూజలలోనూ, పెళ్లిళ్లలోనూ తప్పనిసరిగా ఉంటుంది. వేసవిలో దీని అందం మళ్లీ పుట్టినట్టే ఉంటుంది. ఎండ మంటలలో ఈ చెట్టు నీడనుంచి వెలిసే పువ్వు ఒక ప్రశాంతతను అందిస్తుంది.



## గులాబి చెట్టు

ఓ ప్రేమ గూడు దరిదాపుల్లోనో, ఓ తోటలో ఓటమిలోనో పుట్టే పువ్వు గులాబి. అది కేవలం అందం కాదు.. స్నేహానికి, ప్రేమకి, నిబద్ధతకి నిలిచే సాక్ష్యం. పెళ్లిళ్లలో, పండుగలలో, అలంకారాల్లో ఇది తప్పనిసరిగా ఉంటుంది.

కేవలం పూల చెట్టుగా కాదు, మందులకూ, సుగంధాలకూ ఈ చెట్టు దారి చూపుతుంది. మన గడ్డపై పుట్టినవాడైనా గులాబిని వాసన పీల్చనివాడు కన్నీరు విడవకుండా ఉండడు.



## చెమ్మచెట్టు

ఎండలో దహించే నిప్పులా ఎరుపెక్కే చెట్టు ఇది. వీధి చివరల్లో, పొలాల మట్టిలో, గ్రామ దారుల్లో కనిపించే ఈ చెట్టు పేరే పలాశ. వేసవి మంటల్లో ఈ చెట్టు పైకెగసే పువ్వులలో తేనెటీగల కళ కనిపిస్తుంది. హోలీ పండుగకి దీని పువ్వుల నుండి రంగులు చేసేవారు. నేలపై ఇంత అగ్ని రంగు పండేలా చేసే చెట్టు మూడుపూటలా ప్రకృతితో మమేకమవుతుంది.

## రెల్లి చెట్టు

వసంత కాలం రాగానే ఈ చెట్టు పసుపు పూలతో కళకళలాడుతుంది. కేరళ దాకా దీనికి ఎంతో పటిష్టమైన స్థానం ఉంది. మన పక్కనేనైనా, ఇంటి మధ్యనైనా ఇది పెరిగితే ఇంటి ముఖం వెలిగిపోతుంది. దీని కాయలు, ఆకులు మందులా పని చేస్తాయి. జలుబు దగ్గు నుంచి పెద్ద రోగాల వరకూ దీన్ని ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు.

## చంపక చెట్టు

ఒక మట్టి కుండలో పుట్టి మనసుని మాయ చేసే పువ్వు ఇది. చెంపక పువ్వు అంటేనే భక్తి, పవిత్రత, పరిమళం... దీని వాసనతో దేవాలయాలు పరవశించిపోతుంటాయి. ఆ వాసన మనల్ని భక్తిలోకి, అంతర్లోకపు ప్రశాంతత వైపు తీసుకెళ్తుంది. తెలంగాణ తల్లికి దగ్గరైన పుష్పంగా ఇది పాడుకునే పాటల్లోనూ కనిపిస్తుంది.



## విదేశాల వనజాలం

### జపాన్-సకురా చెట్టు

వస్తూ పోతూ గాలిలో తేలే తెల్లని పువ్వులు గాలికొచ్చినట్టు కనిపించి, మాయమైపోతే గుర్తొచ్చేది సకురా చెట్టు. వసంతంలో దేశమంతా తెల్లని, గులాబీ రంగు పూలతో నిండిపోతుంది. ఈ చెట్టు పక్కన కూర్చుని తేనెలాగ తాగితే గడిచిన జీవితం గుర్తొస్తుంది. జపాన్ వాళ్లకు ఇది ఒక జ్ఞాపకాల వనరూ, జీవిత చక్రానికి ప్రతీక కూడా.

### ఫ్రాన్స్-లావెండర్ తోటలు

ఎగిరే గాలిలో, నీలి రంగుల్లో మెరిసే లావెండర్ పూల తోటలు ఫ్రాన్స్ దేశాన్ని పరిమళంగా



మార్చేస్తాయి. దాన్ని చూస్తే గుండె గదిలో ఊహలు పూలలా విరుస్తాయి. ఆ వాసన మనస్సు కదిలించేదిగా ఉంటుంది. చర్మ సంరక్షణ నుండి ఆరోగ్య పదార్థాల వరకూ దీనిని ఉపయోగిస్తారు. ఒక్కసారి ఈ తోటల్లో నడిస్తే జీవితాన్ని మర్చిపోతారు.

### బ్రెజిల్-టిపు చెట్టు

తెల్లని మబ్బుల మధ్య ఎరుపు, గులాబీ పూలతో మెరుస్తూ ఉండే ఈ చెట్టు బ్రెజిల్ దేశానికి ప్రత్యేకమైన ఆభరణం. గాలి శుద్ధి, నీటి నిల్వ, పక్షుల నివాసం.. అన్నీ ఈ చెట్టులో దొరుకుతాయి.

### ఆస్ట్రేలియా-వాటిల్ చెట్టు

పసుపు పువ్వులతో కళకళలాడే వాటిల్ చెట్టు ఆస్ట్రేలియాకు గౌరవానికి, జాతీయం అనే



భావనకు చిహ్నం. సెప్టెంబర్ రాగానే ఊరంతా పసుపు వెలుగుతో మారిపోతుంది. స్థానిక గిరిజనులు దీన్ని తమ సంప్రదాయ వైద్యంలోనూ, ఆచారాల్లోనూ భాగం చేసుకున్నారు.

### చైనా-పియోని చెట్టు

పువ్వుల రాణిలా ఉంటాయా? అనిపించేలా ఉంటాయి పియోని పుష్పాలు. ప్రేమ, ధన సంపద, గౌరవానికి చైనా లోకంలో ప్రతీకలు. ఈ చెట్టు చైనా చిత్రాలలోనూ, కవిత్వంలోనూ, జ్ఞాపకాల వాకిట్లోనూ కనిపిస్తుంది. దీని వర్ణాలూ, పరిమళమూ అసాధారణం.

### ఇటలీ-మాగ్నోలియా చెట్టు

తెలుపు రంగు పువ్వులతో ఏ వనానికి వెలుగులెత్తించేదీ మాగ్నోలియా చెట్టు. ఇటలీలో దీనిని ఆత్మీయతకు, జీవశక్తికి ప్రతీకగా చూస్తారు. వేసవికాలంలో ఈ చెట్టు తోటల మధ్య నడిచే వారికి జీవితం కొత్తగా అనిపిస్తుంది.

### అమెరికా-డాగ్‌వుడ్ చెట్టు

వసంతంలో అతి చక్కని తెలుపు



పూలతో విరబూసే చెట్టు. అమెరికా సంస్కృతిలో ఇది స్నేహానికి, కొత్త జీవితానికి సూచిక. పల్లెటూర్లలో, నగరాల్లో అందరి ఇళ్ల చుట్టూ ఇది కనిపిస్తుంది.

### థాయిలాండ్-రాచప్రుక్ చెట్టు

మన వంటింటి రెల్లి చెట్టే ఇది, కానీ థాయిలాండ్‌లో దీనిని రాజపురుషుల వృక్షంగా గౌరవిస్తారు. పసుపు పువ్వులు రాష్ట్రాన్ని మెరిసిపోతున్నట్టుగా కనిపిస్తాయి. జాతీయ గుర్తింపుగా నిలిచిన ఈ చెట్టు వాళ్ల ఉత్సవాల్లో, కళలలో కనిపిస్తుంది.

ఇంతవరకూ తెలుసుకున్న చెట్లూ, పూలూ ఒక్కొక్కటీ ఓ సంస్కృతిని తెలుపుతాయి. ఈ చెట్లన్నీ మానవతా



భావనకు నిలువెత్తు చిహ్నాలు. వేరే భాష, వేరే నైజం ఉన్నా... ఓ పువ్వు అందాన్ని చూసి మౌనంగా నిట్టూర్పు విడిచే తత్వం మాత్రం అందరికీ ఒకటే. అందుకే చెట్లు మతాలకు, కులాలకు అతీతంగా మనుషుల మనస్సులను ఒక తాటిపైకి తీసుకురావడంలో భాగస్వామ్యమవుతాయి. ఒక చిన్న తోట, ఒక చిన్న నీడ, ఒక వాసన... మనిషి జీవితాన్ని మార్చగల శక్తి వాటిలో ఉంది. ఒక్కొక్క పూల చెట్టు మనిషి హృదయంలో పూయాలి. ప్రతి ఊరిలోనూ ఒక్కో తరం విత్తనమై నాటాలి. పూల వాసనలో పల్లె పరిమళాన్ని, ప్రపంచ పరిమళాన్ని కలపాలని, పచ్చదనం లోకాన్ని పరిమళింపజేయాలని ఈ వాక్యాల వెనక అర్థం.

– డా. చిటికెన కిరణ్ కుమార్

కథ

# రైతే అన్నదాత

నాం చారిపల్లిలో నరసయ్య అనే రైతు ఉండేవాడు. అతనికి భార్య, కొడుకు, కూతురు ఉండేవారు. పొద్దున లేవగానే కొడుకు, కూతురుకు సద్ది గట్టి బక్రిచెప్యాల బడికి పంపేవారు. తల్లిదండ్రులు ఇద్దరూ పొలంపనులకు వెళ్లేవారు. అతనికి మూడెకరాల పొలం ఉన్నది. ఒక ఎకరంలో వరిపంట వేసేవాడు. ఒక ఎకరంలో మొక్కజొన్న వేసేవాడు. అర్ధ ఎకరంలో బర్లకు సొప్ప వేసేవాడు. మిగతా అర ఎకరంలో రకరకాల కూరగాయలు పండించేవాడు. వ్యవసాయదారుడు కాబట్టి కొన్ని పాడిబర్లు ఉండేవి. వాటికి నిత్యం సొప్ప పెట్టి, పిండి పెట్టేవాడు. పాలు పిండి దగ్గరలోని సిద్దిపేట పట్టణానికి వెళ్లి పాలను అమ్ముకునేవాడు. పండించిన కూరగాయలను అతని భార్య గంపల్లో పెట్టి తమ చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి అమ్ముకొని వచ్చేది. ఎవరి పైన ఆధారపడకుండా వారి కుటుంబం సంతోషంగా ఉండేది. ఎండనక, వాననక కష్టపడి పని చేస్తే మంచి పంటలు పండించవచ్చని తండ్రి భావించేవాడు. కానీ ఒక సంవత్సరం వర్షాలు పడక బోర్లలో నీళ్లు అందలేదు. నరసయ్య అతని భార్య చాలా బాధపడ్డారు. వీరి బాధను కొడుకు అర్థం చేసుకున్నాడు.



"నాన్నా, నువ్వు బాధపడకు. నేను చదువుకొని పెద్దయిన తర్వాత మిమ్మల్ని కళ్లల్లో పెట్టి సాదుకుంటాను. ఈ సంవత్సరం కాకపోతే మళ్లీ వచ్చే సంవత్సరం వర్షాలు పడతాయి. మళ్లీ మన బోర్లకు నీళ్లు వస్తాయి. పంటలు పండించుకుందాం" అని కొడుకు ఓదార్చాడు.

కొడుకు అన్న మాటలకు తండ్రి "పెద్దయినంక నన్ను సాదుతాను అంటున్నావు. కానీ రైతు పని చేస్తే నా లాంటి ఒక్క మనిషినే కాదు కొన్ని వేలాది మందికి అన్నం పెట్టవచ్చు. అందుకే రైతును అన్నదాత అన్నారు బిడ్డా!" అని తండ్రి అన్నాడు.

నేను కూడా పెద్దయిన తర్వాత అగ్రికల్చర్ డిగ్రీ చేస్తాను. నేను నేర్చుకున్న విషయాలను వ్యవసాయంలో వినియోగిస్తాను. గొప్ప గొప్ప పంటలు పండిస్తాను. దేశానికి అన్నం పెట్టే అన్నదాతను అవుతానని" కొడుకు అన్నాడు.

కొడుకు మాటలకు తండ్రి కళ్లల్లో ఆనంద భాష్పాలు నిండాయి. చదువుకున్నరంతా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడరాదు. రైతుగా బతికి వేలాది మందికి అన్నం పెట్టవచ్చనే నీతిని తెలుసుకోవాలని తండ్రి కోరుకున్నాడు.

**- గర్నెపల్లి రక్షిత**

# బాలగేయం

## రామచిలుక

చిన్న రామచిలక ఉన్నది
ప్రకృతిలో ఆటాడుతున్నది
వేసిన జామ పండు తిన్నది
వలలో చిక్కుకున్నది

పంజరాన రామచిలుక
పాట పాడలేనన్నది
ఆకాశాన ఎగిరితేనే
ఆటపాటలన్నది
జోస్యం చెప్పమంటు
బందీగా అయినది

రెక్కలు విరిచి వేయ
దిక్కుతోచకున్నది
జాతకాలు తెలిసి ఉంటే
నేనెలా దొరుకుతానన్నది
నా జాతకం బాగా లేక
బందీగా చిక్కానన్నది
నా జాతకమే బాగలేదు
జాతకమెలా చెపుతానన్నది.

ఆకశాన స్వేచ్ఛగా
వదిలివేయమన్నది
జాతకాన్ని నమ్ముకోకు
జీవితాన్ని బలి చేసుకోకన్నది
స్వయంకృషే విజయానికి
పరమపద సోపానమన్నది.

–ఆవుల చక్రపాణి యాదవ్

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

బి.అనూరాధ, కర్నూలు

**ప్రశ్న: దగ్గేవాళ్లకు, తుమ్మేవాళ్లకూ బారెడు దూరంలో ఉండాలని పూర్వీకులు అనేవారు.. కారణమేంటి?**

**జవాబు:** సాధారణ రుగ్మత అయిన జలుబు నుంచి మహమ్మారి క్షయ వరకూ చాలా చాలా వ్యాధులు దగ్గు, తుమ్ముల ద్వారా సంక్రమిస్తాయి. దగ్గినప్పుడు వారి నోటి నుంచి వెలువడే సూక్ష్మ తుంపరల ద్వారా ఈ వ్యాధి కారక సూక్ష్మక్రిములు వేగంగా గాలిలోకి వెలువడుతాయి. ఇవి అత్యంత సూక్ష్మంగా ఉంటాయి. కాబట్టి మన కంటిచూపుకు ఏమాత్రం కనపడవు. అయినా వీటి ద్వారా క్రిములు వ్యాపించే అవకాశం మెండుగా ఉంటుంది. ఈ కారణం వలననే దగ్గేవారికీ, తుమ్మేవారికీ కాస్త దూరంగా ఉండాలని చెప్పేవారు.

సి.రామచంద్రన్,నాయుడుపేట

**ప్రశ్న: సాలీడు దారంతో గూడు దేనికోసం కడుతుంది?**

**జవాబు:** సాలీడు దారం కేవలం గూడు అల్లుకోవడానికే కాదు, ఇంకా అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. దారంతో ఒక చిన్న గుల్ల మాదిరిగా తయారు చేసి అందులో గుడ్లు పెడుతుంది. పిల్ల సాలీడుకు ఒక పారాచూట్‌ను తయారు చేసి ఇస్తే అది గాలిలో ఎగురుతూ కొత్త ప్రదేశాలకు వెళ్లినట్లుగా ఈ చిన్న గుల్ల ఉపయోగపడుతుంది. ఇవి ఈ దారాలను మీటడం ద్వారా ఒకదానితో ఒకటి సంభాషణలు కూడా జరుపుకుంటాయి. అంతేకాదు, ఆహారం సంపాదనకు కూడా ఉపయోగపడతాయి.

# భావ వ్యక్తీకరణ కోసం భాష

భాష ఇష్టపడి నేర్చుకుంటే వచ్చేది. నేర్చుకోవాలనే తపన, సరైన ప్రణాళిక, క్రమశిక్షణ ఉంటే ఎన్ని భాషాలైనా నేర్చుకోవచ్చు. అందుకు చక్కటి దృష్టాంతమే చెన్నైకి చెందిన మహమూద్ అక్రమ్. మహమూద్ అక్రమ్ కేవలం 19 యేళ్ల వయసులోనే 400 భాషల్లో చదవడం, రాయడం, టైప్ చేయడం, 46 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలగడం అతని ప్రతిభకు నిదర్శనం. అతి పిన్న వయస్కుడైన అక్రమ్ బహుభాషా వేత్తగా ప్రపంచ రికార్డులు, ఎన్నో అవార్డులు సాధించారు. 400 భాషలు రాయడమేంటని ఆశ్చర్యపోతున్నారా! ఇది నిజం. ఇన్ని భాషలు ఎలా నేర్చుకోగలిగాడన్న సందేహం ప్రతిఒక్కరికి కలగక మానదు!

అక్రమ్ తండ్రి షిల్పీ మోజిప్రియన్ ఉద్యోగరీత్యా ఇజ్రాయెల్, స్పెయిన్ వంటి విదేశాలకు వెళ్ళవలసి వచ్చినప్పుడు మొదట్లో ఆయనకు భాష సరిగ్గా రాక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. భాష లోపం కారణంగా ఆయన ఎన్నో ఉద్యోగావకాశాలు




కోల్పోవాల్సి వచ్చింది. పక్కా ప్రణాళికతో 16 భాషలు నేర్చుకోవడమే కాదు అనర్గళంగా మాట్లాడగలిగే నైపుణ్యం సాధించాడు. తండ్రి పర్యవేక్షణలో అక్రమ్‌కు నాలుగేళ్ల వయసులోనే భాషలపై అనురక్తి కలిగింది. అక్రమ్ తల్లిదండ్రులు తమ పుత్రునికి తమిళం, ఇంగ్లీషు అక్షరాలు నేర్పిస్తున్న సమయంలో అతని ప్రతిభను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. ఎక్కువ భాషల్లో ప్రావీణ్యత సంపాదించాలనే దృఢ సంకల్పంతో ఆరేళ్ల వయసు వచ్చేసరికి తన తండ్రి పరిజ్ఞానాన్ని అధిగమించాడు. వివిధ భాషలలో కమ్యూనికేట్ చేసే ఓమ్నిగ్లోట్ లాంగ్వేజ్‌పై ఆధారపడి పట్టుదలతో పలు భాషలు నేర్చుకున్నాడు. ఎనిమిదేళ్ల వయసులోనే అతి పిన్న వయస్కుడైన బహు భాషా టైపిస్ట్‌గా తొలి ప్రపంచ రికార్డు సృష్టించాడు. భాషా ప్రావీణ్యం కోసం మరింత పట్టుదలతో ప్రయత్నించి, 10 యేళ్ల వయసులో అక్రమ్ గంట వ్యవధిలోనే 20 భాషల్లో భారత జాతీయ గీతాన్ని రచించి రెండో ప్రపంచ రికార్డును నమోదు చేశాడు. ఒక వాక్యాన్ని మూడు నిమిషాల్లో వీలైనన్ని భాషల్లోకి అనువదించి మాట్లాడినందుకు జర్మనీ ఆయనను 'యంగ్ టాలెంట్' అవార్డుతో సత్కరించింది.

అక్రమ్ భాష గురించి మాట్లాడుతూ "ఎవరైనా మీతో మాతృభాషలో మాట్లాడితే, మీరు మీ హృదయంతో ప్రతిస్పందిస్తారు. కానీ వారు ఇతర భాషల్లో మాట్లాడితే మీ మెదడుతో స్పందిస్తారు" అని అంటాడు. మాతృభాష అంటే అమ్మతో సమానం అని అంటాడు అతను. అతను ఇన్ని భాషలు నేర్చుకోవడం వెనుక ప్రేరణ ఇదే. తమిళం ఆయనకు ఇష్టమైన భాష. అది ఆయన మాతృభాష. 400 భాషలు నేర్చుకున్నా అతనికి నచ్చిన భాష మాతృభాష. జీవితంలో అన్య భాషల అవసరం ఉన్నప్పటికీ, మాతృభాష మాధుర్యాన్ని మరిచిపోలేను అంటాడు అక్రమ్.

**- కోట దామోదర్**

# మెరిసే చిల్లర పైసలు

మన దేశంలో రూపాయి నాణేల్లా కెనడాలో ఉండే నాణేలను టూనీ నాణేలంటారు. చిల్లర డబ్బులు బాగా శబ్దం చేస్తాయని అంటుంటారు. అయితే టూనీ నాణేలు శబ్దం చేయడమే కాదు చీకట్లో మెరుస్తూ కనువిందైన దృశ్యాలను కనువిందు చేస్తాయి. నాణేలకు ప్రత్యేకమైన బయోలూమినిసెంట్ పదార్థాన్ని వాడి తయారు చేస్తారట. అందువల్ల ఈ చిల్లర నాణేలు చీకట్లో మెరుస్తాయి. ఆకాశంలోని నీలం మొదలైన రంగులను స్ఫూర్తిగా తీసుకుని ఈ టూనీ నాణేలు రాత్రిపూట మెరుస్తూ కనిపించడానికి అక్కడి రాయల్ కెనడియన్ మింట్ ముద్రించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలో మెరిసే నాణేలు వున్న ఈ దేశం ఒక్కటేనట. అక్కడి జీవజాతినీ, ప్రకృతి అందాలనీ చీకట్లో నాణేల పైన మెరిసేలా చేయడం ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. అయితే వీటిలో కొన్ని మాత్రమే వాడుకలో ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా వాటిని కొనుక్కోవాలి.



## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

**సింగిల్ పేజీ కథ**

# కొత్త సిలబస్

కలలో కొడుకు అడిగిన ప్రశ్నలకి ఉన్నట్టుండి నిద్రలోనే ఉలిక్కిపడ్డట్టు మెలుకువ వచ్చింది. లేచి కూర్చున్నాను. నుదిటి మీద చేయి వేసి చూసుకుంటే నిజంగానే చెమటలు పట్టి ఉన్నాయి.

పక్కకి తిరిగి చూసాను. వాళ్ళ అమ్మ పడుకొని ఉంది. వాళ్ళ అమ్మ పక్కన వాడు లేడు. తెలియకుండానే తల దగ్గర ఉన్న సెల్ ఫోన్ తీసి టైమ్ చూసాను. ఉదయం నాలుగు గంటల ఐదు నిమిషాలు అయింది. వీడు లేచి స్టడీ రూమ్‌కి వెళ్ళి ఉంటాడనిపించింది.

నెమ్మదిగా అక్కడి నుంచి లేచి బెడ్ రూమ్ డోర్ తెరిచి స్టడీ రూమ్ వైపు చూసాను. వేసి ఉన్న లైట్ కాంతి డోర్ కింద నుంచి కనబడుతూ నా మనసును కొంచెం కుదుట పరిచింది.

నెమ్మదిగా స్టడీ రూమ్ డోర్ తెరిచాను. వాడు మంచం మీద ఒక మూలన రెండు గోడల కార్నర్‌లో కూర్చొని ఒడిలో తలగడ పెట్టుకొని తలగడ మీద పుస్తకం, పుస్తకం మీద తల పెట్టుకొని పడుకొని ఉన్నాడు.

వాడిని చూస్తే జాలేసింది. వయసు ఇప్పుడే పదహారు సంవత్సరాలు వచ్చాయి. వచ్చే ఒకటో తారీఖు నుండే ఇంటర్ బోర్డు పరీక్షలు. మేమెప్పుడూ వాడిని ఉదయాన్నే లేపేస్తాం... ఉదయం చదివితే బాగా మెదడుకి ఎక్కుతుందని.

వాడు కూడా ఎప్పుడూ చదువు విషయంలో మా మాట "కాదు.." అనేవాడు కాదు.

చిన్నప్పటి నుండి వాడి తెలివితేటలు గురించి మా చుట్టాలు బంధువుల ఇళ్లల్లో వాడి ముందే గొప్పగా చెప్పుకుంటుంటారు.

వాడి గురించి ఆలోచించినప్పుడల్లా నాకు ఎప్పుడూ కాసింత గర్వంగానే ఉండేది. కాని మొదటిసారి ఈ రోజు వాడిని ఇలా చూసి మొదట కాస్తా జాలేసినా ఇప్పుడు మరలా ఆ కల గుర్తొచ్చి భయం వేసింది.



"నాన్నా..!

నాకు మంచి మార్కులు వస్తే గుడికి తీసుకొస్తానని అమ్మ దేవుడుకి మొక్కుకుంటుంది. మంచి మార్కులు అంటే ఎన్ని నాన్నా? నాకు మంచి మార్కులు రాకపోతే వాళ్ళ దగ్గర, వీళ్ళ దగ్గర నువ్వు తల ఎత్తుకోలేకపోయావని అమ్మ నా వలన బాధ పడదు కదా నాన్నా. నువ్వు ఎప్పటిలానే నన్ను మీ కొడుకులానే చూసుకుంటావు కదా.. నాన్నా?" అని కలలో ఒకటే ఏడుపు వాడు.

వాడు అడిగన ప్రశ్నలకి సమాధానం నా దగ్గర లేదు.

నాకప్పుడు మెలుకువ రాకపోయింటే ఇంకేమి అడిగేవాడో? అని మనసులోనే అనుకుంటూ కూర్చొని– పడుకొని ఉన్న వాడి దగ్గర శబ్దం వస్తే లెగిసిపోతాడేమోనని నెమ్మదిగా వాడి పక్కన నా తలపైకి లేపి గోడకి ఆనుకొని కూర్చున్నాను.

అంతే..! వాడు సడన్‌గా భయపడి తల లేపి పుస్తకం చదువుతున్నాడు.

ఎదురుగా నన్ను చూచి ఆశ్చర్యపోయాడు.

"ఏరా! భయపడ్డావా?" అన్నాను. నా కళ్లలోకి చూసి కళ్లలో నీళ్ల తిప్పుకున్నాడు. నా వైపు కొంచం దగ్గరగా జరిగి నా ఒడిలో తల పెట్టుకొని ఒకటే వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. మార్కులే జీవితం కాదని తెలుసుకున్న నేను, వాడికైతే అర్థం అయ్యేటట్టు చెప్పి ఓదార్చానుగానీ, సరిదిద్దుకోలేని తప్పు చేస్తున్న మా లాంటి తల్లిదండ్రులకు ఎవరు అర్థం అయ్యేటట్టు చెప్పి ఓదార్చుతారు. మార్కులే జీవితం కాదనే చదువులు ఈ సమాజపు బడిలో కొత్త సిలబస్‌గా ఎవరు చేర్చుతారు. మార్కులు సరిగా రాకపోయినంత మాత్రాన "బిడ్డ మన బిడ్డ కాదా..." అనే సత్యాన్ని పాఠ్యాంశంగా ఎవరు బోధిస్తారు.

**- తిప్పాన హరిరెడ్డి**


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

కథ

# తడిసిన జ్ఞాపకాలు

**గన్నవరపు నరసింహమూర్తి**

ఆ రోజు మా పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం జరిగింది. ప్రతీ నెలా మొదటి వారంలో ఈ మీటింగ్ జరుగుతుంది. ఆ సమావేశంలో విద్యార్థుల ప్రవర్తన, వాళ్ల హాజరు, హోం వర్కుల వివరాలు, పరీక్షల్లో వాళ్లకొచ్చిన మార్కులు, చదువుపట్ల వాళ్ళకున్న ఆసక్తి అన్నీ చర్చిస్తాం. నేను ఈ స్కూలుకి ప్రధానోపాధ్యాయుడిగా వచ్చి ఆరు నెలలవుతోంది.

నేను వచ్చిన తరువాత పాఠశాలలో జరగబోతున్న మొదటి సమావేశం ఇది. ఈ నెల నుంచి ప్రతీ నెలా సక్రమంగా ఈ సమావేశాలు పెట్టాలని నిర్ణయించుకున్నాను. సాయంత్రం 4 గంటలకు సమావేశం. ఆ సమావేశానికి చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

నేను ఆ సమావేశాన్ని ప్రారంభిస్తూ తల్లితండ్రులకు కొన్ని సూచనలు చేసి ఆ తరువాత ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థుల హాజరు, ర్యాంకులు, సబ్జెక్టుల వారిగా వారికొచ్చిన మార్కులు అన్నీ చూపించాను.

అప్పుడు ఓ నలభై ఏళ్ళ స్త్రీ లేచి నిలబడి "సర్! ఓ సందేహం" అని అడిగింది.

ఆమె చూడటానికి తెల్లగా, చీరకట్టుతో చాలా అందంగా ఉంది. ఆమెను ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది.

"చెప్పండి మేడం.. ఏమిటి మీ సందేహం?" అని అడిగాను.

"నా పేరు కావ్యచందన, మా అబ్బాయి శ్రీహర్ష ఇక్కడ 7వ తరగతి చదువుతున్నాడు. మీరు శనివారంనాడు వాడికి హోం వర్కు ఇస్తున్నారు. కానీ ఆదివారం సెలవు కాబట్టి ఆ రోజంతా మేం వాడిని బయటకు పార్కులకో, గుడికో సినిమాలకో తీసికెళతాం. అందుకే వాడు సోమవారం హోం వర్క్ చెయ్యలేకపోతున్నాడు. కాబట్టి ఇంటికి శనివారం వర్కు ఇవ్వకపోతే మంచిదనీ నా అభిప్రాయం" అని చెప్పింది.

కావ్యచందన పేరు వినగానే నా ఆలోచనలు పదిహేనేళ్ళ వెనక్కి వెళ్ళాయి. ఇప్పుడు ఆమెని చూడగానే నాకామె ఎవరో గుర్తుకొచ్చింది. పది హేనేళ్ళ క్రితం నేను పెళ్లి చూపుల్లో ఆమెను చూశాను, అప్పుడు ఆమె ఇంత అందంగా కనిపించింది. కానీ దురదృష్టవశాత్తు ఆ సమయంలో వాళ్ళ నాన్నగారు అకస్మాత్తుగా చనిపోవడంతో అప్పుడు ఆమెతో నా పెళ్లి జరగలేదు.

నేను ఆలోచనల్లోంచి తేరుకొని ఆమెతో "మేడం, మీరు మంచి సూచన చేసారు. మీ లాగే చాలామంది తల్లితండ్రులు ఇదే పొద్దున్నే చెప్పి శనివారం నాడు హోం వర్క్ ఇవ్వొద్దన్నారు. తల్లితండ్రుల కోరిక సహేతుకమైనది కాబట్టి ఇక నుంచి శనివారంనాడు పిల్లలకు హోంవర్క్ ఇవ్వకూడదని నిర్ణయించుకున్నాం" అని చెప్పడంతో వచ్చిన తల్లితండ్రులు చప్పట్లతో తమ సంతోషాన్ని తెలియజేసారు. ఆ తరువాత సమావేశం ముగిసింది.

తల్లితండ్రులందరూ తమ పిల్లలను తీసుకొని అందరూ వెళ్ళిపోయారు.

కావ్యచందన కూడా శ్రీహర్షని తీసుకొని వెళ్ళిపోతూ నా వైపు చూసి చిరునవ్వు నవ్వింది. ఆమె నవ్వులో భావం నాకు అర్థమైంది. అంటే ఆమె నన్ను గుర్తు పట్టిందన్న మాట.

ఆమె వెళ్ళిపోతుంటే నాకు గతం జ్ఞాపకం వచ్చి చాలా ఆవేదన కలిగింది. అప్పటికే పిల్లలు, మిగిలిన ఉపాధ్యాయులు వెళ్ళిపోవడంతో నా గదిలో నేనొక్కడినే మిగిలాను. సాయంకాలం కావడంతో స్కూలు ఆవరణంతా నిశ్శబ్దంగా ఉంది? కానీ నా మనసులో మాత్రం పర్జన్య ఘోష మొదలైంది.

ఆ సమయంలో నాకు గతం గుర్తుకు రాసాగింది.... వెనక్కి వెళ్ళింది. నా ఆలోచనలు పదిహేనేళ్ళ వెనక్కి వెళ్లాయి.

...............

నేను బీయస్సీ ఫస్ట్ క్లాసులో పాసైన తరువాత ఎమ్మెస్సీ చదివి లెక్చరర్ కావాలనుకున్నాను.

కానీ మా నాన్నగారు బీఈడీ చేస్తే త్వరగా ఉద్యోగం వస్తుందనీ చెప్పడంతో నేను నా ఆలోచన మార్చుకున్నాను. అప్పటికే నాన్నగారు పదవీ విరమణ దశకు చేరుకోవడంతో నా ఉద్యోగం మా కుటుంబానికి అవసరం కాబట్టి నేను బిఈడీ చేసాను.



అదృష్టవశాత్తూ బీఈడీ అయిన ఆరు నెలలకు డియస్సీ ద్వారా నాకు జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. ఎప్పుడైతే నాకు ఉద్యోగం వచ్చిందో అప్పటి నుండి మా అమ్మ నాన్న నా పెళ్లి కోసం తొందర పెట్టడం మొదలు పెట్టారు.

“ఇక అప్పట్నుంచీ పెళ్లి చూపుల ప్రహసనం మొదలైంది. అలా ఒక సంవత్సరంలో ఐదుగురు అమ్మాయిలను చూసాను. కానీ వాళ్ళెవ్వరూ నచ్చలేదు. నచ్చకపోవడానికి కారణం ఏమిటో కూడా యవ్వనంలో ఉన్న నాకు అప్పుడు తెలియలేదు.

అందంగా లేరా అంటే అది కూడా అందంగా చెప్పలేని స్థితి. అసలు అందం అంటే ఏమిటో ఇప్పటికీ నాకు అర్థం కాదు. యవ్వనంలో ఎవరు ఎందుకు నచ్చుతారో అన్నది ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్న. ఇక అప్పట్నుంచీ కొన్నాళ్లపాటు పెళ్లిచూపులకు విరామం ఇచ్చాను.

కానీ ఆరు తరువాత మా నాన్నగారు ఇంకో సంబంధం తెచ్చారు. అతని తండ్రి కేంద్ర ప్రభుత్వంలో ఆఫీసరుగా పనిచేస్తున్నాడనీ, పిల్ల డిగ్రీ చదివిందనీ, అందంగా ఉంటుందనీ చెప్పడంతో తప్పక ఆ అమ్మాయిని చూడటానికి నా తల్లి తండ్రులతో కలిసి

ఆ పిల్ల తల్లితండ్రులు మమ్మల్ని సాదరంగా వాళ్ళింటికి ఆహ్వానించారు.

ఇంతలో ఒక అందమైన అమ్మాయి మేం కూర్చున్న హాల్లోకి వచ్చింది. ఆమె తెల్లగా చీర కట్టులో చాలా అందంగా ఉంది. ముఖం తిప్పుకోలేనంతటి సౌందర్యం ఆమెది. ఆ అందాన్ని చూడగానే నా గుండె లయ తప్పింది.

ఆమె కూర్చుంటూ “నా పేరు కావ్యచందన. బీయస్సీ చదివాను” అని చెప్పింది.

“నా పేరు శ్రీహర్ష, బియస్సీ, బిఈడీ. ఇక్కడికి దగ్గర్లోని రఘుదేవపురంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను“ అని చెప్పాను.

ఆ తరువాత మా తల్లితండ్రుల అనుమతితో మేమిద్దరం కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాడటానికి డాబా మీదకు వెళ్ళాం.

ముందుగా ఆమె మాట్లాడుతూ  “నేను ఉద్యోగం చేయడం మీకిష్టమేనా?” అని అడిగింది.

“ఇష్టమంటారేమిటి? చెయ్యాలి. డబ్బు కోసం కాదు కానీ డిగ్రీ చదువు సార్థకం అయ్యేందుకైనా చెయ్యాలి” అని చెప్పానామెతో.

“థాంక్స్. మీకు నేను నచ్చానా?” అని అడిగింది చందన.

“ఆ విషయం నేనడగాలి. మీకు నచ్చని వారెవరైనా ఉంటారా? ఎందుకంటే అంతటి సౌందర్యం మీది. నాకు మీకు బాగా నచ్చింది. ఇంతకీ నేను మీకు నచ్చానా?” అని అడిగాను.

“మీరు నాకు మనస్ఫూర్తిగా నచ్చారు” అని చెప్పింది కావ్యచందన.

**“నా పేరు శ్రీహర్ష, బియస్సీ, బిఈడీ, ఇక్కడికి దగ్గర్లోని రఘుదేవపురంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను” అని చెప్పాను.**

**ఆ తరువాత మా తల్లితండ్రుల అనుమతితో మేమిద్దరం కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాడటానికి డాబా మీదకు వెళ్లాం.**

**ముందుగా ఆమె మాట్లాడుతూ “నేను ఉద్యోగం చేయడం మీకిష్టమేనా?” అని అడిగింది.**

ఆ తరువాత మేమిద్దరం కిందకు వెళ్ళాం.

ఆ తరువాత కొద్దిసేపు మేమంతా కబుర్లు చెప్పుకున్నాం. ఓ గంట తరువాత మా నాన్నగారు వాళ్లతో “ఏ విషయం వారం తరువాత చెబుతాం” అని చెప్పిన తరువాత మేం ఇంటికి వచ్చేసాం.

కానీ దురదృష్టవశాత్తు వారం తరువాత నాన్నగారు వాళ్లకు ఆ అమ్మాయి నచ్చిందని ఉత్తరం రాసే సమయానికి ఆమె తండ్రి రామబ్రహ్మం గారు అకస్మాత్తుగా ఒక రోడ్డు ప్రమాదంలో చనిపోయారన్న కబురు తెలిసి చాలా బాధ పడ్డాం. ఆ తరువాత వాళ్ళు మాతో ఏ సంగతి చెప్పకపోవడం వల్ల ఆ పెళ్లి సంబంధం కూడా తప్పిపోయింది. అయితే ఈసారి నచ్చక కాదు. నచ్చినా ఒనఒకోసారి యోగం లేకపోతే పెళ్లిళ్లు జరగవనడానికి ఈ సంబంధమే ఉదాహరణగా చెప్పొచ్చు.

అలా చందనతో నా పెళ్లి జరగలేదు. ఆ తరువాత చాలా రోజుల పాటు నేను మనిషిని కాలేదు. అప్పట్నుంచి పెళ్లి చూపులకు వెళ్ళడం మానేసేను. కానీ నాన్నగారు ముప్పై ఏళ్ళు దాటిపోయాయనీ గొడవ చెయ్యడంతో తప్పక నీరజని పెళ్లి చేసుకున్నాను.

ఆమె కూడా అందంగానే ఉంటుంది. పెళ్ళైన రెండేళ్ళకు మాకు కూతురు పుట్టింది. నేను కావ్యచందనని మరచి పోలేక ఆమె పేరునే నా కూతురికి పెట్టాను. కానీ దురదృష్టవశాత్తూ సంవత్సరం క్రితం నీరజకు హఠాత్తుగా అనారోగ్యం చేసి చనిపోయింది. అప్పట్నుంచీ నేను వంటరిగానే కూతురు చందనని పెంచుతూ గడిపేస్తున్నాను.

....................

ఎటెండర్ వచ్చి చీకటి పడిందనీ చెప్పటంతో ఆలోచనల్లోంచి తేరుకొని ఇంటికి బయలుదేరాను.

పదిహేను సంవత్సరాల తరువాత ఈరోజు చందనని మళ్ళీ చూసాను. కానీ ఆమె పేరుని మాత్రం రోజు నా కూతురి వల్ల ఉచ్చరిస్తునే ఉన్నాను. అంతగా ఆమెను నేను ఇష్టపడ్డాను. చందన ఇప్పుడు కూడా అందంగానే ఉంది. కానీ ఆమె ముఖంలో అప్పటి కళ, వెలుగు నాకు కనిపించలేదు. అయినా కాలం అన్ని గాయాలనూ మానిపిస్తుంది. ప్రతివాళ్ళు జీవితంలో రాజీ పడక తప్పదు.

ఆ మర్నాడు ఆదివారం కావడంతో నేను నా కూతురు కావ్య చందనని తీసుకొని జంతు ప్రదర్శనశాలకి వెళ్లాను.

చందన జూ.. కి తీసుకువెళ్ళమని ఎప్పటినుంచో అడుగుతున్నా నాకు కుదరక వాయిదా వేస్తూ వచ్చాను. దానికి జంతువులన్నా, పక్షులన్నా గొప్ప ఇష్టం.

ఆదివారం కావడంతో జూ అంతా పిల్లలతో రద్దీగా ఉంది. అయినా నేను ఊవరగా చందనకు అన్ని జంతువులను చూపించాను. గంట తరువాత మేం పెద్ద పులుల ఎంక్లోజర్ దగ్గరకు వెళ్ళాం. అక్కడ చందనకు పులులను చూపిస్తున్న సమయంలో నా దృష్టి దూరంగా వస్తున్న అందమైన స్త్రీ మీద పడింది. ఒక్కసారిగా నేను ఆమెను చూసి ఆశ్చర్యపోయాను. ఆమె కావ్యచందన. ఆమె కూడా నన్ను చూసి మేం చూస్తున్న పులుల ఎంక్లోజర్ దగ్గరకు వచ్చింది. ఆమె పక్కనే శ్రీహర్ష ఉన్నాడు. వాడు నన్ను చూసి నమస్తే అని అన్నాడు.

చాలా రోజుల నుంచి చందన ఇక్కడికి తీసికెళ్ళమని పోరుపెడుతున్నది. అది ఇప్పటికి కుదిరింది.



"మీరు కూడా ఇక్కడికి రావడం మొదటిసారా?" అనీ చందనతో చెప్పాను.

"శ్రీహర్షకి మూడేళ్లప్పుడు అందించాను. ఆ తరువాత కుదరలేదు. ఈ రోజు వాడి ఫ్రెండ్స్ వెళుతుంటే తాను కూడా వెళ్తానన్నాడు. వాణ్ణి పంపడం ఇష్టంలేక నేను వాడితో వచ్చాను. మీరు మొదటిసారి వచ్చారా?" అని అడిగింది చందన.

"లేదు... మూడేళ్ల క్రితం నా భార్య నీరజ బతికున్నప్పుడు వచ్చాం. కానీ రెండేళ్ల క్రితం దురదృష్టవశాత్తూ ఆమె చనిపోయింది. అప్పటి నుంచి నా మనసు బాగులేక బయటకు రావడం మానేసాను. కానీ ఈ రోజు చందన అల్లరి చేయడంతో తప్పలేదు. దానికి జంతువులంటే బాగా ఇష్టం" అని చెప్పి-

"చందనా ఇలారా?" అనీ నా కూతుర్ని పిలిచాను.

చందన పులులను చూడటం ఆపి మా దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చింది.

"ఇది నా కూతురు కావ్యచందన, దీనికి ఆటలంటే బాగా ఇష్టం" అని చెప్పాను చందనతో.

"మీ భార్య చనిపోయినందుకు చాలా బాధ వేస్తోంది. ఒంటరి మగవాళ్ళు పిల్లలను పెంచడం చాలా కష్టం. మీ పిల్లలకు కావ్య చందన అన్న పేరు మీరే పెట్టారా?" అని అడిగింది చందన.

"ఆ పేరంటే నాకు చాలా ఇష్టం. చాలా రోజుల వరకు ఆ పేరుని నేను మరిచిపోలేకపోయాను" అని ఆమెతో చెప్పాను.ఆ మాటలు చెబుతుంటే నా కళ్లు చెమర్చసాగాయి. కొద్దిసేపు మా ఇద్దరి మధ్య మౌనం. ఇంతలో నా కూతురు చందన, శ్రీహర్ష వాళ్ళ స్నేహితులు రావడంతో పులులను చూసి వెళ్లిపోయారు. అప్పుడు మేమిద్దరమే అక్కడ ఒంటరిగా మిగిలాం. అక్కడికి దగ్గర్లో ఉన్న చెట్టు కింద ఉన్న బెంచి మీద ఇద్దరం కూర్చున్నాం. బయట ఎండగా ఉన్నా అక్కడ మాత్రం చల్లటి మలయ సమీరం వీస్తూ హాయి గొలుపుతూ ఉంది. "ఇంతకీ మీ భర్తగారు వచ్చారా? అతను ఏం చేస్తారు?" అనీ చందనని అడిగాను.

"ఒక ప్రైవేట్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేసేవారు. కానీ డ్యూటీలో ప్రమాదం జరిగి నాలుగేళ్ళ క్రితం చనిపోయారు" చెమర్చిన కళ్ళను తుడుచుకుంటూ చెప్పింది చందన.

ఆమె చెప్పిన ఆ వార్త వినగానే నా గుండె బాధతో మూగబోయింది. ఆమెకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. కొద్దిసేపటి దాకా మా ఇద్దరి మధ్య మౌనం. కొద్దిసేపటికి చందన తేరుకొని "మా అబ్బాయి శ్రీహర్ష ఎలా చదువుతాడు? పరవాలేదా?" అని అడిగింది చందన.

"చాలా తెలివైనవాడు, చురుగ్గా ఉంటాడు. క్లాసులో వాడే ఫస్టు. మంచి సందేహాలు అడుగుతుంటాడు" అని చెప్పాను.

"వాడికి మీరంటే చాలా ఇష్టం. రోజు మీరు బాగా చెబుతారనీ చెబుతాడు" అంది చందన.

"ఆ రోజు.. దురదృష్టంకొద్దీ మీ నాన్నగారు చనిపోవడంతో మన పెళ్లి జరగలేదు. అయినా మీ వాళ్ళు మా ఇంటికి వచ్చి అడుగుతారని చాలా రోజులు ఎదురు చూశాను. కానీ మీ వాళ్ళెవరూ రాకపోయేసరికి కొన్నాళ్ల తర్వాత నేనే మీ ఇంటికి వచ్చాను. కానీ మీరు ఆ ఊరి నుంచి ఎక్కడికో వెళ్లిపోయారని పక్కవాళ్ళు చెప్పడంతో నిరాశతో తిరిగి వెళ్ళిపోయాను.

మీతో అప్పుడు పెళ్లి కాకపోవడంతో నేను చాలా రోజులు బాధపడ్డాను. ఇక జీవితంలో పెళ్లి వద్దనుకున్నాను" చెమర్చిన కళ్లను తుడుచుకుంటూ చెప్పాను ఆమెతో.

"లైఫ్ ఈజ్ నాట్ ఎ ప్రాబ్లమ్ టు బి సాల్వ్‌డ్, బట్ ఎ రియాల్టీ టు బి ఎక్స్‌పీరియన్స్‌డ్"

"జీవితం పరిష్కరించాల్సిన సమస్య కాదు, అనుభవించాల్సిన వాస్తవం. జీవితం గురించి మనం ఎన్ని కలలు కన్నా వాస్తవంలో జీవించక తప్పదు" చందన చెబుతుంటే ఆమె మాటల్లో విషాదం ధ్వనించింది.

"మీరు గతాన్ని తలుచుకొని బాధపడతారా?" అని అడిగానామెను.

"జీవితంలో అనుకోని సంఘటనలు జరగడం, తప్పులు చేయడం సహజం. కానీ చీకటిని తిడుతూ కూర్చుంటే వెలుగురాదు. చిరుదీపాన్ని వెలిగించక తప్పదు. అయినా జీవితం అంటే ఆశల ఎండమావుల వెంట పరిగెత్తడమే. అవన్నీ సరే పిల్లలు వస్తున్నారు. నేను వెళతాను" అంది ఆమె లేచి నిలబడుతూ.

వెంటనే నేను కూడా లేచి నిలబడి "చందనా! ఒక్క నిమిషం. మీ అబ్బాయి శ్రీహర్షకి ఆ పేరు మీరే పెట్టారా?" అని అడిగాను.

నా ప్రశ్నకు ఆమె కొద్దిసేపు మౌనం దాల్చి నా వైపు చూసింది. ఆ తరువాత గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆ సమయంలో చూసిన ఆమె కళ్ళలోని తడి నాకు స్పష్టంగా కనిపించింది.

# తేనెలొలుకు తెలుగు

శతాబ్దాల సాహిత్య చరిత్ర, భాషా చరిత్ర గల అందమైన భాష తెలుగు. దానిని ఆకళింపు చేసుకున్న జాతి తెలుగు జాతి. ప్రతీ సంస్కృతి, సంప్రదాయం ఎంతో అర్థవంతమైన మన సంస్కారాన్ని, ఉన్నతిని ప్రతిబింబిస్తుంది. అందుకే తోట గాలి, ఏటి నీరు, తేట తెనుగు కన్నా స్వచ్ఛమైనవి లేవంటారు మన పెద్దలు. తేట తేట తెనుగులా.. అంటూ తెలుగు గొప్పదనాన్ని వర్ణించాడో కవి. తెలుగులో వచ్చిన సాహిత్యం అమూల్యమైనది. పాశ్చాత్య భాషలలో ఇటాలియన్ వంటిదని నికోలాయ్ కొంటి వంటి వారు తెలుగును పొగిడారంటే దీని విశిష్టత అర్థం చేసుకోవచ్చు. సి.పి.బ్రౌన్ వంటి బ్రిటిష్ ఉన్నతాధికారులు వేమన పద్యాలు చూసి ముగ్ధులై తెలుగు అభిమానులుగా మారారు. దీన్ని మరింత అభివృద్ధి చేయడానికి రేయింబవళ్ల కృషి చేసారు. పదకోశాలు తయారు చేసారు. పూర్వం తెలుగు భాషా సౌందర్యం జనపదమై, జానపదమై, పాటై, వచనమై, పద్యమై, కవిత్వమై, తెలుగుదనం పరవశించేది. పుట్టిన పాపాయి ఏడుస్తుంటే "ఏడవకు ఏడవకు వెర్రి పాపాయి, ఏడిస్తే నీ కళ్లు నీలాలూ కారు, నీలాలూ కారితే నే చూడలేను.." అంటూ ఆ కంటి నీరు తననెంత బాధపెడుతుందో తల్లి చెబుతుంటే, ఆ తల్లి ఒడి వెచ్చదనానికో, పాటలోని మాధుర్యానికో, ఆర్ద్రతకోగానీ పాపాయి నిద్రలోకి జారుకునేది.




ఇంత కమ్మని భాష మన తెలుగు భాష. జ్ఞానపీఠ అవార్డును సైతం దక్కించుకున్న భాష మన తెలుగు భాష. 'అమ్మ' అన్న పిలుపులో అనురాగం ధ్వనిస్తుంది, 'నాన్న' అన్న పిలుపులో అభిమానం ధ్వనిస్తుంది. ఇంత మాధుర్యం సంతరించుకున్న మన భాష ఈ తరం యువతకు, చిన్నారులకు దూరమవుతోంది. పూర్వం తెలుగుజాతి ప్రతి దశలోనూ మాతృభాష పరిమళం అంటిపెట్టుకుని ఉండేది. పుట్టినప్పటి నుండి లాలి పాటలు, తప్పటడుగులు వేసే వేళ మురిపాల ముచ్చట్లు, చదువుకునేటప్పుడు సాంస్కృతిక సౌరభం, వివాహ సమయంలో ప్రతీ ఘట్టం మధుర భావాల సుమనోహరమై, సమాహారమై తెలుగుతనంతో విడదీయరాని అనుబంధమై తెలుగు అక్షరమే తరగని ఆస్తిగా, కొండంత అండగా నిలిచింది. మధురస్మృతులై వెన్నెల వెలుగులు నింపింది.

అలనాటి జీవన చిత్రంలోకెళితే అడుగడుగునా తెలుగు భాషా పరిమళం వికసించి, జీవితమంతా రంగు రంగుల హరివిల్లును చూపినంత ఆనందంతో, ప్రశాంతంగా, ఉల్లాసంగా గడచిపోయేది. జోలపాటలో రాగ రంజితమైన లాలింపు, వేదంతార్థాలు నిక్షిప్తమై, వింటుంటే వినాలనిపించేలా ఉండేవి. 'కస్తూరి రంగ రంగా..' అంటూ పాపాయికి పేరు పెట్టేప్పుడు, ఉయ్యాలలో వేసేటప్పుడు పాడే పాటల్లో లాలిత్యం, మధురత్వం ఏరులై పారేది. పాపాయి అన్నం తిననని మారాం చేస్తే రాత్రిపూట చందమామను చూపిస్తూ, 'చందమామ రావే...' అంటూ పాడితే చందమామను చూసిన పరవశానికో, అందులోని తెలుగు తేటదనానికో చక్కగా బువ్వ తినేవారు పిల్లలు. నేటి ఆకాశ హర్మ్యాల వంటి అపార్టుమెంట్లలో ఎంతమంది చందమామను చూస్తున్నారు?

'చిట్టి చిలకమ్మ', 'చిట్టి చిట్టి మిరియాలు', 'దాగుడు మూతల దండా కోర్', 'వీరి వీరి గుమ్మడి పండు..', 'ఒప్పులకుప్ప వయ్యారి భామ', 'తారంగం తారంగం..' అని ఇలా పద్యం/పాట గానీ ఎంతో పరవశం కలిగేలా మనసుకి హాయి గొలిపేలా ఉండి నీతిని, విజ్ఞానాన్ని అంతర్లీనంగా ప్రతిబింబించేవి. 'కాళ్ళగజ్జె కంకాలమ్మ.....'లో ఔషధాలకు సంబంధించిన విజ్ఞానం, 'చింతకాయ దప్పడం.. పప్పేసి కలపడం, కంఠమెల్ల మెక్కడం, కడుపు నొప్పి రావడం...' ఎక్కువ తింటే కడుపునొప్పని చెప్పకనే చెప్పడం, ఇంకా 'ఒకటి ఓ చెలియా....రెండు రొకళ్ళు.....మూడు ముచ్చిలక..నాలుగు నందన్న....' అంటూ అంకెలు ఆటలతోనే నేర్పడం జరిగేవి.

చదువు విజ్ఞానాన్ని పెంపొందించేలా మాత్రమే కాక వ్యక్తిత్వ వికాసానికి, జీవించడానికి కావలసిన తెగింపు సమకూరుస్తుంది. 'పలువురెదుట నిలిచి భాషింప భయమేల తెలుగు బిడ్డ' అంటూ ధైర్యాన్ని నూరిపోస్తుంది. 'ధైర్యే సాహసే లక్ష్మీ' అనుకుంటూ ఆత్మవిశ్వాసం ప్రతిబింబించేలా మాట్లాడేలా చేస్తుంది. పెద్దై పెరిగాక కూడా ఆ తెలుగుదనంలోని నుడికారం అడుగడుగునా ప్రతిఫలిస్తూ పరవశాన్ని కలుగచేసేది. భాష ఒకటిగా ఉన్నప్పుడే జాతి ఒకటిగా ఉంటుంది. భాష కనుమరుగైతే, సంస్కృతి దూరమౌతుంది. భాష, సంస్కృతి లేని జాతి క్రమంగా సహజ లక్షణాలు కోల్పోతుంది.

ఒకప్పటి మాట ఎలా ఉన్నా ప్రస్తుతం మన తెలుగు ప్రచుర్యం, ప్రాముఖ్యత కొంత తగ్గింది. తెలుగు జాతి మనది. నిండుగా వెలుగు జాతి మనది.. అన్నట్లు అందరూ గర్వంగా చెప్పుకునేటట్లు 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ..'తో పాటు తెలుగు జిలుగుల వెలుగు హారం వేయాలి. సహజంగానే ప్రతీ తెలుగు వాడి భావితరాల మనస్సుల్లో 'తెలుగు', పూలు వికసింపజేయాలి.

మన తెలుగు భాష సౌందర్యాన్ని, పరిమళాన్ని నలుదిశలా వెదజల్లాలి. పల్లెల్లో పాడుకునే పద్యాలు, జానపద గేయాలు కమ్మదనాన్ని తీయదనాన్నీ తరతరాల సంపదగా రేపటి పౌరులకి అందించాలి. పురాతన కాలం నుండి ఎన్నో మార్పులు, చేర్పులతో తీయని జ్ఞాపకాలను, చమత్కారాలను తనలో నిక్షిప్తం చేసుకున్న తియ్యని తెలుగును, పొడుపు కథలుగా, కవితలుగా, కావ్యాలుగా, కథలుగా రేపటి పౌరులకు నాటికలుగా, నవలలుగా పరివర్తనం చెంది వారసత్వ సంపదగా అందించాలి.

**- టి. సంయుక్తా కృష్ణమూర్తి**

# అతి మధురం తేనె!

తేనెటీగలు మానవుడికి ప్రసాదించిన అద్భుతమైన వరం తేనె. మంచి పదార్థాలను మధురవాక్కులను తేనెతో పోలుస్తారు. కొన్ని వేల మైళ్ల దూరం అలుపన్నది లేకుండా పువ్వులపై వాలి తేనెటీగ మకరందాన్ని సేకరిస్తుంది. ఆకుచాటు కొమ్మకి అనేక చిన్న చిన్న గదులతో ఉన్న గూడును తేనెటీగలు నిర్మిస్తాయి. అందులో రాణిఈగ ఉంటుంది. రాబోయే కాలం కోసం ప్రతి పువ్వు నుంచి ఒక్కో తేనెటీగ పూలమకరందాన్ని సేకరించి తాను నిర్మించిన గూడు అనే భవనంలోని చిన్న గదుల్లో దాచిపెడుతుంది. మనిషి ఆ గూడును చూశాడు. తేనె రుచిని కనుగొన్నాడు. వెంటనే ఆ భవంతి అంటే గూటిని పడగొట్టి అందులో తేనె పిండుకున్నాడు. ఆ తేనెలోని మాధుర్యాన్ని రుచి చూసిన తర్వాత అందులోని పోషకాలను ఆరోగ్య సౌందర్య గుణాలను గుర్తించాడు.

తర్వాత మనిషే తేనెటీగలను పెంచి చిన్న పెట్టెల్లో గూటిని తయారు చేసి తేనెటీగలు సేకరించిన తేనెను పిండడం ప్రారంభించాడు. అప్పటి నుంచి రంగు రంగుల తేనెలు రకరకాల తేనెలు తయారు అవుతాయి. తేనె కూడా తియ్యగా ఉంటుంది కాని ఔషధభరితం. ఎందుకంటే వివిధ రకాల పూలలోని మకరందం పుప్పొడి పరిమళం కలగలిపిన అద్భుతమయిన రుచి తేనెకు ఉంటుంది. అందుకే తేనెలను అమృతాన్ని మరపించే దివ్య ఔషధమని అంటారు. ఇప్పుడు పసుపు బూడిద ముదురు కాఫీనలుపు ఇలా విభిన్న రంగులతోబాటు రంగులేని తేనెలున్నాయి. ఒక్కో తేనె ఒక్కో రకమైన రుచిని, సుగంధాన్ని వెదజల్లుతుంది. యూకలిప్టస్ నిమ్మజాతి పూలతేనె ఘాటైన రుచి వాసనను కలిగి ఉంటుంది. అందుకే బేకింగ్ ఉత్పత్తుల్లో చక్కెరకు బదులు తేనె వాడడం వల్ల ఆ పదార్థాలు మరింత రుచిగాను సువాసనాభరితంగా ఉంటాయి.



శుద్ధి చేయని ముడితేనెను జుంటితేనె అంటారు. ఈ తేనెలో విటమిన్లు ఎంజైమ్‌లు యాంటీ యాక్సిడెంట్లు మరింత పుష్కలంగా ఉంటాయి. అందుకే శక్తికోసం తేనెను నేరుగా తినవచ్చు లేదా గోరువెచ్చని నీటిలో కలిపి తాగితే మందులా పని చేస్తుంది. ఆయుర్వేదం అల్లోపతి అన్న తేడా లేకుండా అన్ని రకాల వైద్య పద్ధతుల్లోను తేనె నిస్సంకోచంగా వాడవచ్చు.

గ్రీకులు, రోమన్లు, చైనీయులు, ఈజిప్షియన్లు, భారతీయులు వీరంతా ప్రాచీన కాలం నుంచి తేనెను వైద్యంలో వినియోగిస్తూనే ఉన్నారు. శుశ్రుత సంహిత అనే ప్రాచీన ఆయుర్వేద గ్రంథం తేనెను తాగే మందుగా వర్ణించింది. శ్వాసకోశ వ్యాధులకు తేనెను మించిన ఔషధం లేదు. గాయాల నివారణతో పాటు కడుపుకు సంబంధించిన అనేక వ్యాధులను తేనె తగ్గిస్తుందని పురాతన వైద్య గ్రంథాలు పేర్కొంటున్నాయి. అందుకే ఆధునిక పరిశోధకులు తేనెలోని ఔషధ గుణాలమీద ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తేనెను ప్రతిరోజూ ఆహారంలో భాగంగా ఉపయోగించవచ్చు. ఇలా తీసుకోవడంవల్ల హృద్రోగుల సంఖ్య తగ్గినట్లు పరిశోధనల్లో తేలింది. తేనెలో అదనంగా ఉండే విటమిన్ సి, మోనోఫినాలిక్‌లు, ఫ్లేవనాయిడ్లు, పాలీఫినాలిక్‌లు, యాంటీయాక్సిడెంట్లుగా పని చేయడమే ఇందుకు కారణం. స్థూలకాయంతో బాధపడేవారికి క్రమం తప్పకుండా 30 రోజుల పాటు రోజు 70 గ్రాముల తేనెను ఇచ్చి చూస్తే వాళ్ల బరువులో 1.3 శాతం తేడా ఉండగా కొలెస్ట్రాల్ మాత్రం 3 శాతం వరకు తగ్గిందట. తేనెను నిమ్మరసం దాల్చినచెక్కపొడి కలిపి తీసుకున్నా బరువు తగ్గుతారు. అంతేకాదు తేనెను గోరు వెచ్చటి నీటితో కలిపి తీసుకోవడంవల్ల శరీరంలో నిల్వ ఉన్న కొవ్వులు తగ్గుతాయి. జుంటితేనె బిపిని తగ్గిస్తుంది. శరీరంలో ఇన్సులిన్‌ను క్రమబద్ధీకరిస్తుంది. రక్తంలో చక్కెరనిల్వలు తగ్గకుండా చూస్తుంది. వ్యాయామం చేశాక తేనె తీసుకోవడంవల్ల అలసట ఉండదు. యాంటీ బ్యాక్టీరియల్ యాంటీఫంగల్ గుణాలు అధికంగా ఉండే తేనె మంచి యాంటీసెప్టిక్‌గా కూడా పనిచేస్తుంది.

తేనెలోని న్యూరాస్యూటికల్స్ యాంటీయాక్సిడెంటుగా పనిచేస్తూ శరీరంలో హానికరమయిన ఫ్రీరాడికల్స్‌ను తొలగిస్తాయి. తేనె గాయాలను త్వరగా తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ మైక్రోబియల్ లక్షణాలవల్ల ఇది ఆటోలిటిక్ డెబ్రిడిమెంటుగా పనిచేస్తుంది. పుండ్లలోని చెడువాసనను తొలగిస్తుంది. పచ్చిగాయాల మీద ప్రభావంతంగా పనిచేస్తుంది. అందుకే మాంచెస్టర్ విశ్వవిద్యాలయ పరిశోధకులు కేన్సర్ రోగులకు శస్త్రచికిత్స అనంతరం తేనెను వాడే ఆలోచనలో ఉన్నారు. మచ్చల్ని మాయం చేయడంలో తేనెను మించింది లేదు. స్థానికంగా దొరికే తేనెను తాగడం వల్ల అలర్జీలు తగ్గుతాయి. తేనెటీగలు చుట్టుపక్కల మొక్కల నుంచి తేనెను సేకరించడం వల్ల ఆ పరాగరేణువులు శరీరంలో చేరి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. చక్కెర పదార్థాల సమ్మిశ్రితమే తేనె. ఇందులో ఫ్రక్టోజ్ 98 శాతం, గ్లూకోజ్ 31 శాతం, సుక్రోజ్ 1 శాతం, నీరు 17 శాతం, ఇతరత్రా చక్కెరలు 9 శాతం ఉంటాయి. కేవలం చక్కెరలకే అంత చిక్కదనం ఎలా వచ్చిందంటే కూలి ఈగలు మకరందాన్ని తెచ్చేటపుడు వాటిలోని కొన్ని ఎంజైమ్‌లు అందులో కలుస్తాయి. తర్వాత ఈగలన్నీ తేనెపట్టులోకి చేరి అక్కడ రెక్కలారుస్తూ ఎగరడంవల్ల మకరందంలోని నీరు ఆవిరై గాఢత పెరిగి తేనెలా మారుతుంది. అందుకే పంచదారతో పోలిస్తే తేనెలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. అమెరికా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ లెక్కప్రకారం టేబుల్‌స్పూన్ పంచదారలో 15 కేలరీలుంటే తేనె వల్ల పొడిబారిన జుట్టు మృదువుగా మారుతుంది. ఇలా ఎన్నో సుగుణాలు తేనెలో ఉన్నాయి.

**- యామిజాల జగదీశ్**

# 'కులిశ వేధ' అంటే ఏమిటి?


వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458




ఇంటి ప్రధాన ద్వారం ఏ ఆయుధం చేతనైన పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసం అయినప్పుడు(కొట్టబడుట/ నరకబడుట) ఆ గృహానికి 'కులిశ వేధ' దోషం సంక్రమిస్తుంది. ప్రధాన ద్వారంగాక ఏ ఇతర ద్వారంగానీ, గొడ్డలి, గునపం మొదలైన ఆయుధం చేత పూర్తిగాగానీ పాక్షికంగా గానీ ధ్వంసం అయినపునపడు ఇదే దోషం ఆ గృహానికి ప్రాప్తించబడుతుంది. సింహద్వారం ధ్వంసం అయినందువల్ల దోషం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అటువంటి గృహంలో ఉండేవారు కోలుకోలేనటువంటి తీవ్ర నష్టాలు పొందే అవకాశముంటుంది.

'కులిశ్ నహతో ద్వారో గృహాంతస్థే మృతిర్భవేత్'

కులిశ వేధ దోషం వున్న గృహంలో నివసించేవారికి మరణం సంభవిస్తుందని దీని తాత్పర్యం. అందువల్ల ఇటువంటి దోషాలను తీవ్రంగా పరిగణించి వెంటనే దోష పూరిత ద్వారాలను తీసివేసి కొత్త ద్వారాలను వాస్తు నియమానుసారం ప్రతిష్ఠించుకోవటం అన్ని విధాల మంచిది. నష్టం కలిగే వరకు వేచి చూడకుండా ముందే జాగ్రత్త పడటం తప్పనిసరి. ఆయుధాల చేత కొట్టబడిన ద్వారాల పైన ఏర్పడిన పగుళ్లను, రంధ్రాల పైన ఏర్పడిన పగుళ్లను, రంధ్రాలను కనిపించకుండా లప్పం, మైనం మొదలైన వాటితో సరిచేయటం వలన ఉపయోగం ఉండదు. తప్పనిసరిగా కొత్త ద్వారాలను ప్రతిష్ఠించవలసిందే.

## ఎవరు పెద్ద? ఎవరు చిన్న?

**– సి.వనజ, ఏదులాపురం**

**ప్రశ్న: కవల పిల్లల విషయంలో ఎవరు పెద్ద? ఎవరు చిన్న? అని ఎలా నిర్ధారణ చేయాలి? ఈ విషయం ఎటూ తేల్చుకోలేక కొన్ని సందర్భాలలో(అంటే జాతక, కర్మలు మొ॥) చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. దీనికి ఏమైనా పరిష్కారముందా?**



**జవాబు:** జాతక, కర్మాదుల యందే కాక వివాహ వ్యవహారాదుల యందు కూడా జ్యేష్ఠ, కనిష్ఠ నిర్ణయం చాలా సందర్భాలలో అవసరమవుతుంటుంది. మొదట జన్మించినవారు పెద్దవారని, తదుపరి జన్మించినవారు చిన్నవారని సాధారణంగా చెబుతుంటారు. అన్ని సందర్భాలలో అది సరికాదు.

**శ్లో॥ యమశౌచైక గర్భేతు స్త్రీవా పురుష ఏకవా**
**కనిష్ఠ ఆద్యజాతస్యాత్పశ్చాజ్ఞాతో**
గ్రజస్స్మృతః ॥

1) గర్భంలో వున్న ఇరువురు శిశువులు పైన ఒకరు, కింద ఒకరు ఉండినట్లయితే మొదట జన్మించినవాడు చిన్న వాడుగాను(కనిష్ఠ) పిదప జన్మించినవాడు పెద్దవాడుగాను (జ్యేష్ఠుడు) అని నిర్ధారించుకోవాలి.

2) ఒకవేళ గర్భంలో ఉన్న ఇరువురు శిశువులు పక్క పక్కనే వున్నప్పుడు మొదట జన్మించినవాడు జ్యేష్ఠుడు, పిదప జన్మించినవాడు కనిష్ఠుడిగా గ్రహించాలి.

3) గర్భస్థ శిశువు విధానం తెలియనప్పుడు మొదట జన్మించినవారు చిన్నవాడుగా, పిదప జన్మించినవారు పెద్ద వాడుగా గ్రహించటం శిష్టాచారం.

## 'కంక వేధ' అంటే ఏమిటి?

ప్రశ్న: 'కంక వేధ' అని దేనినంటారు? వివరించగలరు.

**– ఎన్.రాఘవన్, పుత్తూరు**

**జవాబు:** గృహ గర్భానికి నాలుగు వైపులగానీ, రెండు వైపులగానీ వసారాలను సమానంగా ఉంచాలి. అలాగాక బేసి సంఖ్య వసారాలను నిర్మించినా, హెచ్చు-తగ్గులుగా వసారాలను నిర్మించినా 'పార్శ్వహీనంతధాకంకః" అనే లక్షణానుసారం 'కంకవేధ' దోషం ఏర్పడుతుంది. ఇలాంటి వేధ కలిగే గృహంలో నివసించేవారు, గృహ యజమాని దారిద్ర్యాన్ని అనుభవించవలసి వస్తుంది. కనుక ఒక గృహానికి వసారాలను ఏర్పరచుకోవలసి వస్తే తప్పనిసరిగా అందుకు అవసరమైన వాస్తు నియమాలను పాటించాలి.

ఒకవేళ ఇటువంటి వేధను కలిగిన ఇంట్లో నివసిస్తూ దారిద్ర్య బాధలను అనుభవించేవారు, వారి బాధలకు కారణం 'కంక వేధ' దోషం తెలుసుకొని వసారాలను వాస్తు నియమానుసారం సరిచేసుకున్న ట్లయితే తప్పకుండా దారిద్ర్య బాధల నుండి విముక్తి పొందగలుగుతారు.. అనటంలో సందేహం లేదు.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు.
ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,
రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త


పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:................................................

# అరుదైన బ్లడ్ గ్రూప్

సాధారణంగా మానవ రక్త గ్రూపులను 'ఏ, బి, ఒ', ఆర్ హెచ్.. అని రెండు ప్రధాన వ్యవస్థలుగా వర్గీకరిస్తారు. ఏ, బి, ఒ వ్యవస్థలో, ఏ, బి, ఎబి, ఒ అని నాలుగు ప్రధాన రక్త రకాలు ఉంటాయి. వీటిని తిరిగి ఆర్‌హెచ్‌డి పాజిటివ్ లేదా ఆర్‌హెచ్‌డి నెగటివ్‌గా వర్గీకరించడంతో మొత్తం ఎనిమిది సాధారణ రక్త రకాలు ఏర్పడతాయి.

ఒక వ్యక్తి ఎర్ర రక్త కణాలపై యాంటిజెన్ ఏ లేదా బి ఆధారంగా ఆ వ్యక్తి రక్త గ్రూపును ఏ లేదా బి గాను ఆర్‌హెచ్ ఫ్యాక్టర్ (ప్రోటీన్) ఉంటే ఆ రక్త వర్గాన్ని పాజిటివ్ (+)గా, లేకపోతే నెగటివ్()గా వర్గీకరిస్తారు. ఈ వర్గీకరణ ఆధారంగానే శస్త్రచికిత్సలు నిర్వహించే సమయంలో దాత రక్తం గ్రహీత రక్తంతో అనుకూలంగా ఉందా లేదా అని సరిపోల్చి చూస్తారు. రక్త రకాల (బ్లడ్ గ్రూప్స్) గురించి తెలుసుకోవడం వల్ల రక్త మార్పిడి సమయంలో ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి దానం చేసిన రక్తాన్ని సురక్షితంగా మార్పిడి చేయడానికి అవకాశముంటుంది. అవయవ మార్పిడికి కూడా రక్త రకాలు అనుకూలంగా ఉండడం తప్పనిసరి.

అయితే, ఇటీవల ప్రపంచంలోనే ప్రప్రథమంగా బెంగళూరుకు చెందిన ఒక మహిళకు ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని 'క్రిబ్' అనే బ్లడ్ గ్రూప్ ఉన్నట్లు గుర్తించారు. ఇది ప్రపంచ రక్తమార్పిడి శాస్త్రంలో ఒక విప్లవాత్మక ఆవిష్కరణగా వెలుగులోకి వచ్చింది. 'క్రిబ్' రక్త సమూహం ఎ,బి,ఒ లేదా ఆర్ హెచ్ వంటి సాధారణ రక్త రకాల్లో భాగం కాదు. ఇది ఐఎన్ఆర్ఎ (ఇండియన్ రేర్ యాంటిజెన్) అనే అరుదైన రక్త సమూహానికి చెందినది. దీనిని 2022లో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అధికారికంగా ఆమోదించింది. భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్ శాస్త్రవేత్తలు 'క్రిబ్' అనే కొత్త, చాలా అరుదైన మానవ రక్త సమూహాన్ని కనుగొన్నారు.



బెంగళూరు సమీపంలోని కోలార్‌కు చెందిన 38 యేళ్ల మహిళను వైద్యులు పరీక్షించిన తర్వాత ఈ ఆవిష్కరణ జరిగింది, ఆమెకు మరే ఇతర రక్త సమూహానికి సరిపోని రక్త వర్గం ఉంది. వివరణాత్మక పరిశోధన తర్వాత, ఆమె రక్తం అధికారికంగా కొత్త రకం రక్తం 'క్రిబ్'గా గుర్తించబడింది. ప్రపంచంలో ఈ రకమైన రక్త సమూహం ఉన్న ఏకైక వ్యక్తి ఆమె అని అంచనా వేయబడింది.

## ప్రపంచంలోనే అరుదైన బ్లడ్ గ్రూప్

ప్రపంచవ్యాప్తంగా వైద్య పరిశోధకులను ఆశ్చర్యపరిచిన ఒక కేసులో, ఇటీవల కర్ణాటక రాష్ట్రం, బెంగళూరు నగరానికి సమీపంలోని కోలార్‌కు చెందిన 38 యేళ్ల మహిళలో గుండె శస్త్రచికిత్స సమయంలో 'క్రిబ్' రక్త గ్రూపు కనుగొనబడింది. కాగా ఇటలీలోని మిలన్‌లో జరిగిన 35వ ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్(ఐఎస్‌బిటి) కాంగ్రెస్ (రక్తమార్పిడి వైద్య రంగంలోని నిపుణుల ప్రపంచవ్యాప్త సమావేశం) సమావేశంలో ఈ రక్త గ్రూపుకు అధికారికంగా 'క్రిబ్' అని నామకరణం చేసారు.

ఆ మహిళ గుండె శస్త్రచికిత్స కోసం ఆసుపత్రిలో చేరినప్పుడు ఆమె రక్తం, అత్యంత సాధారణ రక్త గ్రూప్ అయిన 'ఒఆర్‌హెచ్ పాజిటివ్'గా నమోదు చేయబడింది. అయితే, ఆశ్చర్యకరంగా ఆమె రక్తం అందుబాటులో ఉన్న అన్ని ఒఆర్‌హెచ్ పాజిటివ్ రక్త యూనిట్లతో ప్రతికూలంగా ఉన్నట్లు తేలింది. దీంతో ఆ మహిళ రక్త నమూనాను పరీక్షల కోసం రోటరీ బెంగళూరు టిటికె బ్లడ్ సెంటర్‌లోని అడ్వాన్స్‌డ్ ఇమ్యునోహెమటాలజీ రిఫరెన్స్ లాబొరేటరీకి పంపగా, అక్కడ అధునాతన పరీక్ష ఆశ్చర్యకరమైన ఫలితాన్ని వెల్లడించింది. ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోని ఒక నివేదిక ప్రకారం, ఆ పరీక్షా కేంద్రంలోని రక్త మార్పిడి నిపుణుడు డాక్టర్ అంకిత్ మాథుర్ "ఆమె రక్తం ప్యాన్‌రియాక్టివిటీని చూపించింది (అంటే అది ప్రతి పరీక్ష ప్యానెల్‌తోనూ అనుకూలంగా లేదు)" అన్నారు. ఈ పరిశోధన, తెలిసిన రక్త వర్గాలతో సరిపోని అపూర్వమైన రోగ నిరోధక ప్రొఫైల్‌ను వెల్లడించింది. కొత్తగా కనుగొనబడిన ఈ యాంటిజెన్ క్రోమర్ రక్త సమూహ వ్యవస్థకు చెందినది కావడంతో అధికారికంగా 'క్రిబ్' అని పేరు పెట్టారు. 'క్రిబ్'లో 'సిఆర్' క్రోమర్‌ను, 'ఐబి' భారతదేశం, బెంగళూరును సూచిస్తుంది అని ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక తెలిపింది.

అరుదైన ఈ రక్త గ్రూప్ క్రిబ్, ప్రస్తుత రక్తమార్పిడి శాస్త్రాన్ని సవాలు చేస్తోంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా అరుదైన రక్త గ్రూప్ దాతల నమోదును, అధునాతన జన్యు పరీక్షల (జెనెటిక్ స్క్రీనింగ్) కీలకమైన ఆవశ్యకతను నొక్కి చెబుతుంది.

బెంగళూరులోని మణిపాల్ హాస్పిటల్ నుండి డాక్టర్ సి.శివరామ్ మాట్లాడుతూ "చాలా మందికి ఎ,బి,ఒ, ఆర్‌హెచ్ రక్త రకాలు మాత్రమే తెలిసినప్పటికీ, వాస్తవానికి 47 వేర్వేరు గుర్తించబడిన రక్త గ్రూపు వ్యవస్థలు (ప్రతి ఒక్కటి నిర్దిష్ట యాంటిజెన్ల ద్వారా నిర్వచించబడ్డాయి) ఉన్నాయని వివరించారు.

## కుటుంబ సభ్యుల రక్త నమూనాతో సరిపోలకపోవడం


గుండె శస్త్ర చికిత్స కావడంతో ముందు జాగ్రత్త చర్యగా, ఆమె కుటుంబంలోని 20 మంది సభ్యుల నుండి రక్త నమూనాలను సేకరించారు. సదరు మహిళ రక్తాన్ని ఆ రక్త నమూనాలతో పరీక్షించి చూడగా, ఆశ్చర్యకరంగా ఆమె రక్త నమూనా ఏ కుటుంబ సభ్యుడి రక్త నమూనాతోనూ సరిపోలేదు. ఇది ఆ మహిళ రక్త రకం అసాధారణంగా అరుదైనది అనే అనుమానాన్ని మరింత ధృవీకరించింది. సంక్లిష్టమైన కేసు నేపథ్యం కారణంగా పొంచి ఉండే ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని రోగి కుటుంబ సభ్యులు సర్వ సమ్మతి, వైద్యుల సహకారంతో శస్త్రచికిత్స బృందం, రక్తమార్పిడి లేకుండానే అత్యంత జాగ్రత్తగా శస్త్రచికిత్స నిర్వహించింది.

## ప్రపంచంలోనే మొదటి వ్యక్తి

రోగి, ఆమె బంధువుల నుండి రక్త నమూనాలను వివరణాత్మక జన్యు, సెరోలాజికల్ విశ్లేషణ కోసం యునైటెడ్ కింగ్‌డమ్, బ్రిస్టల్‌లోని ఇంటర్నేషనల్ బ్లడ్ గ్రూప్ రిఫరెన్స్ లాబొరేటరీ (ఐబిజిఆర్ఎల్)కి పంపగా దాదాపు పది నెలల విస్తృత మాలిక్యులర్ పరిశోధనల తర్వాత, అక్కడి పరిశోధకులు గతంలో నమోదు చేయని రక్త గ్రూప్ యాంటిజెన్‌ను గుర్తించారు. కొత్తగా కనుగొనబడిన ఈ యాంటిజెన్ క్రోమర్ (సిఆర్) రక్త సమూహ వ్యవస్థకు 'క్రిబ్' అని అధికారికంగా పేరు పెట్టి, జూన్ 2025లో మిలన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ 35వ ప్రాంతీయ కాంగ్రెస్‌లో ప్రకటించడంతో కోలార్‌కు చెందిన ఆ మహిళ ఇప్పుడు ప్రపంచంలోనే 'క్రిబ్' యాంటిజెన్‌తో గుర్తించబడిన మొట్టమొదటి వ్యక్తిగా రికార్డులకెక్కింది.

## 'క్రిబ్' ఎందుకు ఇంత ప్రత్యేకం?

ప్రామాణిక రక్త సమూహ వర్గీకరణ ఏ,బి,ఒ, ఆర్‌హెచ్ వ్యవస్థలపై దృష్టి పెడుతుంది. అయితే కెల్, డఫీ, క్రోమర్ వంటి 30 కంటే ఎక్కువ ఇతర గుర్తింపు పొందిన రక్త సమూహ వ్యవస్థలు ఉన్నాయి. చాలా మంది ఎర్ర రక్త కణాలలో కనిపించే సాధారణ యాంటిజెన్ లేకపోవడం వల్ల ఈ రక్తం చాలా భిన్నంగా ఉంటుంది. ఈ యాంటిజెన్ లేకపోవడం వల్ల ఈ రక్తం ఇతర రక్త సమూహాల కంటే ప్రత్యేకంగా ఉంటుంది. ఈ రక్తానికి అనుకూలమైన దాతను కనుగొనడం దాదాపు అసాధ్యం. దీని వలన క్రిబ్ రక్తం ఉన్నవారికి రక్త మార్పిడి చాలా ప్రమాదకరం. ఈ వ్యవస్థలలోని యాంటిజెన్‌లు రక్తమార్పిడి అనుకూలతకు గణనీయమైన ప్రభావాలను చూపుతాయి. సంక్లిష్టమైన గ్లైకోప్రొటీన్ నిర్మాణాలకు ప్రసిద్ధి చెందిన క్రోమర్ సమూహానికి 'క్రిబ్' యాంటిజెన్ కొత్త కోణాన్ని జోడిస్తుంది. ప్రత్యేకించి ఈ మహిళ విషయంలో– ఆమె ఎర్ర రక్త కణాలు అన్ని తెలిసిన ప్రతిరోధకాలకు ప్రతికూలంగా స్పందించాయి. ఇది గతంలో ఎప్పుడూ చూడని యాంటిజెనిక్ ప్రొఫైల్ ఉనికిని సూచిస్తుంది.



## అరుదైన రక్త వర్గాలు

ఐరోపాలో ఇటీవల గుర్తించబడిన కొత్త రక్త రకం ఇఎంఎం నెగటివ్ వ్యవస్థ కిందకు వచ్చే గ్వాడా నెగటివ్, 'క్రిబ్'కి సమాంతరంగా ఉంది. జూన్ 2024 నాటి న్యూస్ 18 నివేదిక ప్రకారం, పారిస్‌లో నివసిస్తున్న గ్వాడెలోప్‌కు చెందిన ఒక మహిళలో ఈ యాంటిజెన్ ఉనికి ఏమాత్రం లేదు. క్రిబ్ యాంటిజెన్ లాగానే ఇఎంఎం యాంటిజెన్ దాదాపు అన్ని మానవ ఎర్ర రక్త కణాలలో ఉండడం వలన ఇది ఆమె పరిస్థితిని వైద్యపరంగా అసాధారణంగా మారుస్తుంది. భారతీయ మహిళ కేసులా కాకుండా, ఫ్రెంచ్ మహిళ రక్త నమూనా 2011 నుండి నిల్వ చేయబడి, 2019లో నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జిఎస్) లోతైన విశ్లేషణ పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత మాత్రమే కచ్చితంగా వర్గీకరించబడింది. ఇద్దరు తల్లిదండ్రుల నుండి వారసత్వంగా వచ్చిన అరుదైన మ్యుటేషన్ కారణంగా ఆమెలో ఇఎంఎం యాంటిజెన్ ఏర్పడలేదని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది ఆమె స్వంత రక్తంతో మాత్రమే అనుకూలంగా ఉండడంతో, ఆమె విషయంలో రక్త మార్పిడి సవాలుగా మారుతుంది. క్రిబ్, గ్వాడా నెగటివ్ వంటి ఆవిష్కరణలు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న మానవ జన్యుశాస్త్రం, రక్త మార్పిడి వైద్యవిధానం సంక్లిష్టతను తెలియచేస్తాయి.

కర్ణాటకకు చెందిన ఆ మహిళకు ఇది ఒక సాధారణ శస్త్రచికిత్స అయినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగాన్ని ప్రత్యేకించి రక్త మార్పిడి విభాగానికి సంబంధించిన నిపుణుల దృష్టిని ఒక్కసారిగా అప్రమత్తం చేసింది. ఈ నూతన రక్త సమూహాలు భవిష్యత్ పరిశోధన క్లినికల్ సంరక్షణకు సంబంధించి కొత్త ద్వారాలు తెరవనుంది.

**- యేచన్ చంద్రశేఖర్**

**టెర్రకోట** అంటే కాల్చిన మట్టి అని అర్థం. ఇది మట్టిని కాల్చడం ద్వారా తయారు చేసే ఒక కళారూపం. టెర్రకోట బొమ్మల చరిత్ర చాలా ప్రాచీనమైనది. ప్రపంచంలోని వివిధ నాగరికతలలో దీని ఉనికిని చూడవచ్చు.

## టెర్రకోట బొమ్మల చరిత్ర

భారతదేశంలో టెర్రకోట కళకు సుదీర్ఘ చరిత్ర ఉంది. సింధు లోయ నాగరికతకు చెందిన హరప్పా, మొహెంజొదారో వంటి ప్రదేశాలలో అనేక టెర్రకోట కళాఖండాలు, ముఖ్యంగా దేవతా విగ్రహాలు, జంతువుల బొమ్మలు లభించాయి. తలతో వేరు చేయగల టెర్రకోట ఎద్దు బొమ్మలు, కదులుతూ ఆశ్చర్యపరచే టెర్రకోట కోతి బొమ్మలు ఈ నాగరికతలో బొమ్మల తయారీలో ఉన్న నైపుణ్యాన్ని చూపుతాయి. క్రీ.పూ.1950 నాటి మెసొపొటేమియాకు చెందిన అద్భుతమైన టెర్రకోట ఫలకాలు ఉన్నాయి.

ప్రాచీన ఈజిప్ట్ అనేక విగ్రహాలు టెర్రకోటతో తయారు చేశారు. గ్రీసులో క్రీ.పూ.3000 నాటి చిన్న టెర్రకోట బొమ్మలు లభించాయి. తనాగ్రా (టాగ్రా) బొమ్మలు గ్రీకు టెర్రకోట కళలో ప్రసిద్ధి చెందినవి. ఇవి అచ్చుల ద్వారా భారీగా ఉత్పత్తి చేసి తరచుగా అలంకరణ వస్తువులుగా ఉపయోగించేవారు. క్రీ.పూ.4వ శతాబ్దం నుండి టెర్రకోట బొమ్మలు అలంకరణ నిమిత్తం ఉపయోగించారు. చైనీయుల చరిత్రలో టెర్రకోట సైనికులు (టెర్రకోట ఆర్మీ) ప్రసిద్ధి.

ఈ టెర్రకోట బొమ్మలు యుద్ధవీరులకు సంబంధించినవి. షియాన్‌లోని చక్రవర్తి సమాధి వద్ద 8,000కి పైగా జీవన పరిమాణంలోని టెర్రకోట సైనికులు, గుర్రాలు, రథాలు కనుగొన్నారు. ఈ బొమ్మలు మరణానంతర జీవితంలో చక్రవర్తిని రక్షించడానికి తయారు చేశారు. చైనా, ఈజిప్టు ఇత్యాది కొన్ని సంస్కృతులలో మరణానంతర జీవితంలో ఉపయోగం కోసం సమాధులలో టెర్రకోట బొమ్మలను ఉపయోగించారు.

## భారతదేశంలో టెర్రకోట బొమ్మలు

బౌద్ధుల కాలంలో కూడా టెర్రకోట వస్తువులకు, ప్రతిమలకు అధిక ప్రాధాన్యత లభించినట్టు తెలుస్తుంది. మౌర్యుల కాలం క్రీ.పూ.322-185 ప్రాంతంలో టెర్రకోట బొమ్మలు ప్రధానంగా అమ్మ దేవతల రూపంలో ఉండేవి. ఇది సంతానోత్పత్తి సంస్కృతిని సూచిస్తుంది. ముఖాల తయారీల కోసం అచ్చులు ఉపయోగించేవారు. కాల్చిన సమయాన్ని బట్టి రంగు ఎరుపు నుండి లేత నారింజ రంగు వరకు ఉండేది. శాతవాహనుల కాలంలో రెండు వేర్వేరు అచ్చులను ఉపయోగించేవారు. ఒకటి ముందు భాగం కోసం, మరొకటి వెనుక భాగం కోసం. వాటిని కలిపి లోపల ఖాళీగా ఉండేలా బొమ్మలను చేసేవారు. ఈ సాంకేతికత రోమన్ల నుండి దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తోంది.

## ఆధునిక కాలంలో టెర్రకోట బొమ్మలు

భారతదేశంలో టెర్రకోట బొమ్మలు అనేక ప్రదేశాలలో తయారవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో టెర్రకోట బొమ్మల తయారీ కేంద్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పలమనేరు మండలం గంటావూరులో టెర్రకోట మట్టికుండలు, బొమ్మలు తయారు చేస్తారు. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని కంటేవారిపల్లె కూడా టెర్రకోట కళాకృతులకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఎలాంటి యంత్రాలు, అచ్చు పరికరాలు లేకుండా కేవలం చేతి వేళ్లతో 700 రకాల మట్టి కళాకృతులను తయారు చేస్తారు. నేటి ఆధునిక కాలంలో టెర్రకోట బొమ్మల తయారీలో అనేక మార్పులు వచ్చాయి. పశ్చిమ బెంగాల్‌లోని టెర్రకోట దేవాలయాలు ప్రసిద్ధి చెందాయి. బంకురా గుర్రం కూడా బెంగాల్ టెర్రకోట కళకు చెందిన ప్రసిద్ధ కళాఖండం. బెంగాల్‌లోని బంకురా గుర్రపు బొమ్మలు జానపద కళాకృతులుగా ప్రసిద్ధి చెందాయి.

కోల్‌కతాలోని ప్రిన్స్ అన్వరా రోడ్డులోని టెర్రకోట నిలయం టెర్రకోట వస్తువుల తయారీకి కేంద్రబిందువుగా ఉంది. పశ్చిమ బెంగాల్‌లోని బిష్ణుపూర్, బంకూరలోని టెర్రకోట దేవాలయాలు బెంగాలీ సంస్కృతిలో భాగంగా నేటికీ నిలిచి ఉన్నాయి. బీహార్, జార్ఖండ్, రాజస్థాన్, తమిళనాడు వంటి రాష్ట్రాలలో టెర్రకోట బొమ్మల తయారీ కేంద్రాలు ఉన్నాయి. బంకురా జిల్లాలో టెర్రకోట బొమ్మలు ముఖ్యంగా బంకురా గుర్రాలు చాలా ప్రసిద్ధి చెందాయి. ఈ గుర్రాలు సంప్రదాయ కళాకృతులుగా ఇళ్ల అలంకరణకు, ఆచారాలకు ఉపయోగిస్తున్నారు.

# కళాత్మకత ఉట్టిపడే టెర్రకోట ఉత్పత్తులు



తమిళనాడులోని చెన్నై, కాంచీపురం, మధురై మొదలైన ప్రాంతాల్లో దేవతలు, జంతువులు, సంప్రదాయ బొమ్మలు రూపొందిస్తున్నారు. ఇవి పండుగలు, ఆలయ అలంకరణలకు ఉపయోగపడతాయి. హర్యానాలోని కొండ ప్రాంతాల నుండి తీసుకున్న మట్టితో ఆధునిక హంగులతో టెర్రకోట బొమ్మలు తయారవుతాయి. ఈ బొమ్మలు హస్తకళా మేళాల్లో ఆకర్షణగా నిలుస్తాయి. రాజస్థాన్‌లో టెర్రకోట బొమ్మలు సంప్రదాయ డిజైన్లతో తయారవుతాయి. ఈ బొమ్మలు గ్రామీణ జీవన శైలి, సాంస్కృతిక చిత్రాలను ప్రతిబింబిస్తాయి. రాజస్థాన్‌లోని రాజసమంద్‌లోని మోలెలా గ్రామంలో చదునైన ఉపరితలంపై అచ్చు మట్టితో దేవతా మూర్తులను సృష్టిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, గోరఖ్‌పూర్ వంటి ప్రాంతాల్లో టెర్రకోట కళాకృతులు తయారవుతాయి. వీటిని గృహ అలంకరణ, ఆచార వస్తువులుగా ఉపయోగిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో టెర్రకోట బొమ్మలు స్థానిక కళాకారులచే రూపొందిస్తున్నారు. ఇవి సంప్రదాయ శైలితో ఆకర్షణీయంగా ఉంటాయి. మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో టెర్రకోట బొమ్మలు తయారవుతాయి. ఇవి స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే డిజైన్లతో ఉంటాయి. గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లో టెర్రకోట కళాకృతులు, బొమ్మలు తయారవుతాయి. ఇవి గ్రామీణ జీవన శైలి, సంప్రదాయ చిత్రాలతో రూపొందిస్తున్నారు. గుజరాత్‌కు చెందిన టెర్రకోట బంకమట్టి కళాకారులు ముఖ్యంగా భుజ్ జిల్లాలోని గుండియాలీకి చెందినవారు. ఒడిశాలో టెర్రకోట బొమ్మలు, ముఖ్యంగా జగన్నాథ దేవుడి బొమ్మలు, గ్రామీణ శైలిలో తయారవుతాయి. ఇవి ఆలయాలు, గృహాలలో అలంకరణకు ఉపయోగపడతాయి. ఒడిశాలోని టెర్రకోట క్లే ఆర్ట్ 4వ శతాబ్దం నాటిది. గిరిజన కళాకారులు ప్రత్యేకమైన మట్టిని ఉపయోగించి ప్రత్యేకమైన డిజైన్లను రూపొందించారు. బీహార్‌లోని దర్భంగా టెర్రకోట మట్టి గుర్రాలకు ప్రసిద్ధి చెందింది.



## టెర్రకోట బొమ్మల తయారీ విధానం

టెర్రకోట బొమ్మలు తయారు చేయడానికి కొన్ని దశలు ఉన్నాయి. సాధారణంగా నదులు, చెరువుల పక్కన లభించే బంకమట్టి, ఎర్రని రేగటి మట్టిని టెర్రకోట బొమ్మల తయారీకి ఉపయోగిస్తారు. ఈ మట్టిని శుద్ధి చేసి, ఇసుక, రాళ్లు వంటి మలినాలను తొలగిస్తారు. మట్టికి సరైన నిలకడను ఇవ్వడానికి కొంత నీటిని కలుపుతారు. టెర్రకోట బొమ్మలు తయారీకి మంచి నాణ్యతగల ఎర్ర మట్టి (టెర్రకోట క్లే) ఉపయోగిస్తారు. ఈ మట్టి సాధారణంగా సరైన సాంద్రత, సౌకర్యవంతమైన లక్షణాలను కలిగి ఉంటుంది. మట్టిని శుభ్రం చేసి, రాళ్లు, చెత్త వంటి అవాంఛిత పదార్థాలను తొలగిస్తారు. కొన్నిసార్లు మట్టి బలాన్ని పెంచడానికి ఇసుక, ఇతర పదార్థాలను కలుపుతారు. చాలా టెర్రకోట బొమ్మలను చేతితోనే తయారు చేస్తారు. మట్టిని అవసరమైన ఆకారంలోకి మలుస్తారు. కొన్ని సందర్భాల్లో ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ఒకే రకమైన బొమ్మలను తయారు చేయడానికి అచ్చులను ఉపయోగిస్తారు. కుండలు, ఇతర పాత్రల కోసం కుమ్మరి చక్రాన్ని ఉపయోగించినా, టెర్రకోట బొమ్మల తయారీకి కూడా కొన్నిసార్లు దీనిని ఉపయోగిస్తారు. బొమ్మలకు అలంకరణలు చేయడానికి వివిధ రకాల శిల్పకళా పరికరాలను ఉపయోగిస్తారు. ఆకారం ఇచ్చిన తర్వాత బొమ్మలను గాలిలో ఎండలో పూర్తిగా ఆరబెడతారు. ఈ బొమ్మలు సునాయాసంగా విరిగిపోకుండా అనేక జాగ్రత్తలు తీసుకుని తయారు చేశారు. ఇది బొమ్మలోని తేమను తొలగించడమే కాకుండా కాల్చేటప్పుడు పగుళ్లు రాకుండా సహాయపడుతుంది.

టెర్రకోట తయారీలో అత్యంత ముఖ్యమైన దశ కాల్చడం. ఎండిన బొమ్మలను కొలిమి, బట్టీలోకానీ, సంప్రదాయ పద్ధతిలో, దహన పదార్థం పైన ఉన్న గుంటలో పెట్టి కాలుస్తారు. ఈ ప్రక్రియలో మట్టిలోని ఐరన్ ఆక్సైడ్‌లు ఆక్సిజన్‌తో చర్య జరిపి, టెర్రకోటకి ప్రత్యేకమైన ఎరుపు రంగును ఇస్తాయి. కొన్ని సందర్భాల్లో ఉపయోగించిన మట్టి రకాన్ని బట్టి పసుపు, నారింజ, ఎరుపు, గులాబీ, బూడిద లేదా గోధుమ రంగులలో కూడా బొమ్మలు ఉండవచ్చు. కాల్చిన తర్వాత, కొన్ని బొమ్మలకు రంగులు వేయడం, మెరుపు పూయడంతో పాటు ఇతర అలంకరణలు చేస్తారు. ఇప్పుడు అనేకమంది ఆర్టిస్టులు టెర్రకోట వస్తువులపై వాటర్ కలర్స్, పెయింటింగుల చిత్రీకరణ, లితోగ్రాఫ్‌తో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

ఆధునిక కాలంలో టెర్రకోట కళాకారులు కొత్త సృజనాత్మక పద్ధతులను, ఆధునిక డిజైన్లను ఉపయోగించి షాండ్లియర్స్, దీపాలు, నీటి నిల్వ కుండలు, పెరుగు కుండలు, మొక్కల కుండీలు, గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు టెర్రకోటతో తయారు చేస్తున్నారు. టెర్రకోట కళారూపాలు అనాదిగా మానవ నాగరికతలో ఒక ముఖ్యమైన భాగం. టెర్రకోట బొమ్మలు తయారీలో రాష్ట్రాలు, స్థానిక కళాకారులు వారి సంప్రదాయ శైలిని అనుసరిస్తారు. ఈ బొమ్మలు హస్తకళా మేళాల్లో, స్థానిక మార్కెట్లలో విక్రయిస్తున్నారు. వీటిని చూసేందుకు, కొనుగోలు చేసేందుకు స్థానికులతో పాటు పర్యాటకులు కూడా ఆసక్తి కనబరుస్తుంటారు.

**- షేక్ అబ్దుల్ హాకీం జాని**

## 31 ఆగస్టు, 2025 నుండి 6 సెప్టెంబరు, 2025 వరకు



# వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం సంతాన ఆరోగ్యం పట్ల ఆందోళన చెందుతారు. వారి గురించి ఎంతగానో సమయాన్ని ధనాన్ని కేటాయిస్తారు. వారి బాగోగులే మీ ఆనందంగా ప్రాణప్రదంగా భావిస్తారు. తల్లిదండ్రులుగా మీయొక్క బాధ్యతలను ఎంతో శ్రద్ధతో నిర్వహిస్తారు. దైవాను గ్రహాన్ని అందుకుంటారు. ఓం నమో నారాయణ ఒత్తులతో అష్టమూలికాతైలంతో నిత్య దీపారాధన చేయండి.

### వృషభం

ఈ వారం సాంకేతిక విద్య బిజినెస్ మేనేజ్మెంట్ నేర్చుకోవాలన్న ఆలోచనలు ముడిబడతాయి. ఆర్థిక స్తోమత లేని వారికి ప్రభుత్వం ఆసరాగా నిలబడుతుంది. అనుకున్న ఉన్నత చదువులను చదువుకోగలుగుతారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటికి రావడానికి చేసే ప్రయత్నాలు కలిసొస్తాయి.

### మిథునం

ఈ వారం సంతాన సంబంధిత విషయాలలో మీరు అతిగా చొరవ చేసుకున్నట్టుగా జీవిత భాగస్వామి నుండి కొన్ని విమర్శలు వెల్లువెత్తాయి. వాళ్ళు ఎదిగినప్పటికీ చెడు అలవాట్లకు బానిస అవుతున్నప్పుడు పెద్దవారిగా మనం చొరవ తీసుకొని మంచి మార్గంలో నిలబెట్టడం తప్పేమీ కాదన్న మీ వాదనే నెగ్గుతుంది. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

### కర్కాటకం

ఈ వారం మీ సొంత ఆలోచనలు శ్రేయస్కరం కొత్త కార్యక్రమాలని ప్రారంభించి మీదైన శైలిలో వాటిని నిలబెట్టుకో గలుగుతారు. ఎన్నో రకాల అవంతరాలు ఆటంకాలు ఎదురైన ప్పటికీ వెనుతిరగరు. ఎంతగానో శ్రమించి పోరాడి విజయాన్ని సాధించాలి అన్న దృక్పథంతో ముందుకు అడుగు వేస్తారు. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి.

### సింహం

ఈ వారం అనుకున్న కార్యక్రమాలలో పురోగతిని సాధించగలుగుతారు. నూతన వ్యాపారాలు ప్రారంభించాలన్న ఒక సాహసోపేతమైన టువంటి నిర్ణయాన్ని చేయగలుగుతారు. కార్యాలయంలో పెరుగుతున్న పనికి కొంతమందితో వాగ్వివాదాలు జరిగే సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఓం నమశ్శివాయ వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి.

### కన్య

ఈ వారం కార్యాలయంలో నూతన కార్యక్రమాలు ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. కొన్ని మార్పులు తీసుకురాగలిగితే మీకు మంచి గుర్తింపు వస్తుందని భావిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు అంతంతమాత్రంగా ఉంటాయి. విడ బడి ఒంటరిగా నిలబడాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. కోర్టు తగాదాలు వివాదాలు పరిష్కరించుకోగలుగుతారు. పూజల్లో నాగ సింధూరం కుంకుమను ఉపయోగించండి.

### తుల

ఈ వారం ఉన్నత విద్య వైద్య విద్య ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరపతి పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు స్నేహాలుగా మారుతాయి. లీజులు లైసెన్సులు కాంట్రాక్టుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి. నూతన వ్యాపార ఒప్పందం బాగుంటాయి. వ్యాపారంలో చేసే మార్పులు అనూహ్యంగా కలిసి వస్తాయి.

### వృశ్చికం

ఈ వారం ఆరోగ్య విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోండి. కొన్ని శుభకార్యాలకు సంబంధించిన విషయాలు అనుకూలిస్తాయి. ప్రేమ పట్ల మీకు ఉన్న అభిప్రాయం పూర్తిగా మారిపోతుంది. చేతికి సుబ్రహ్మణ్య పాశుపత కంకణాన్ని ధరించండి. కొన్ని కార్యక్రమాలు నిమిత్తం కొంతమంది సహాయ సహకారాలను మీరు ఆశిస్తారు. వారి ద్వారా ప్రయోజనాలు ఉంటాయి.

### ధనస్సు

ఈ వారం ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల సంఘ సేవ కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి ఉంటారు వాళ్లకు విలువైన వస్తువులు, వస్త్రాలు బహుమతులుగా ఇవ్వాలన్న ఆలోచనలు ముడిపడతాయి.

### మకరం

ఈ వారం జీవిత భాగస్వామి పట్ల శ్రద్ధ చూపుతారు. వారి అవసరాలు, గృహోపకరణాలు కొనే ప్రయత్నాలు చేస్తారు. కుటుంబం భాద్యతలు పెరుగుతున్న అవి ఆనందంగా స్వీకరిస్తారు. మరి కొన్ని సంవత్సరాలలో మనం బాగుంటాము అన్న ధైర్యాన్ని కలిగి ఉంటారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి త్రిశూల్ పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. దుర్గ దేవి శ్లోకం రోజు చదవండి.


### కుంభం


ఈ వారం రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. కళ్ళకు చక్రాలు కట్టుకొని మరి పనిచేస్తారు. ప్రయోజనాలను కోల్పోకూడదు మన పిల్లలకి దక్కాలి అని భావిస్తారు. శుభవార్త వింటారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నరదిష్టి తొలగిపోతుంది. విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. వైద్య విద్య పట్ల మక్కువ చూపిస్తారు.


### మీనం

ఈ వారం ఎన్నో ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొంతమందితో సఖ్యతగా వ్యవహరిస్తారు. దూరప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. ఉద్యోగరీత్యా ఒడిదొడుకులు ఏర్పడుతున్నప్పటికీ కొన్ని కారణాల నిమిత్తం ఉద్యోగం వదులుకోలేని పరిస్థితులు ఏర్పడతాయి. గృహనిర్మాణ ఆలోచనలలో ఎన్నో మార్పులు ఏర్పడతాయి.

# ఈ వారం కార్టూన్స్


ఇన్ని రోగాలున్నా.. అసలు మందులు వాడకుండా మూర్ఖంగా ఎలా బతికున్నారో.. రీసెర్చ్ చేస్తాడట.. పర్మిషనిస్తే!!
Zakir...


ఇప్పుడే కనుక్కున్న.. మోహన్ పాక్ కు 278, కిట్టు గాడికి 236, శీను బావకు 254 అంట షుగరు!!
LAB
షుగరు
198


అంటే.. నో పార్కింగ్ బోర్డు చూసి పార్కింగ్ చేయకుండా ఊరుకుంటారా? అంత పిరికివాళ్ళా ఈ దేశం వాళ్ళు?!
P
NO PARKING
పార్క్
Zakir...



మహిళల
కోసమే నిర్మించిన ఈ
ఐలాండ్ ఫిన్‌లాండ్‌లో ఉంది.
దీనిని సూపర్ షీ ఐలాండ్
అంటారు.









